ప్రజాశక్తి
శనివారం 04 ఫిబ్రవరి 2023 5
కర్నూలు





ట్రైలర్ లాంచ్ వేడుకలో మాట్లాడుతున్న కల్యాణ్‌రామ్

ము(ఖ)ప్పు తిప్పలు...

- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు
- సర్వత్రా వ్యక్తమవుతున్న ఆగ్రహం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల హాజరు కోసం తీసుకొచ్చిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ఉద్యోగులను ముప్పతిప్పలు పెడుతోంది. తొలుత ఉపాధ్యాయులకు, ఆ తరువాత జిల్లా కార్యాలయాల ఉద్యోగులకు ఈ విధానాన్ని అమలు చేయగా హాజరు కోసం ఇబ్బందులు పడుతుండటంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది...

ఉద్యోగులు తమ ఫోన్‌లలోనే ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా రోజు వారీ హాజరు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులకు ముఖ హాజరు తిప్పలు తప్పడం లేదు. ఆగస్టు 16 నుండి ఉపాధ్యాయులకు ఈ విధానాన్ని మొదలు పెట్టారు. సర్వర్ మొరాయిస్తుండడంతో ఉపాధ్యాయులు సెల్ ఫోన్‌తో కుస్తీ పడ్డారు. మారుమూల ప్రాంతాల్లో నెట్ కవరేజ్ లేకపోవడంతో యాప్ ఓపెన్ కాకపోవడం, సర్వర్లు పని చేయకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే విధానాన్ని జనవరి 15 నుంచి ఉద్యోగులకు కూడా అమలు చేయడంతో వారికి కూడా హాజరు తిప్పలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో 61 శాఖల పరిధిలో 16,870 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వారిలో ఇప్పటి వరకు 5,945 (35.24 శాతం) మంది వివరాలు నమోదు చేసుకున్నారు. 10,925 (64.76 శాతం) మంది ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకోలేదు. సైనిక్ వెల్ఫేర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్, లైఫ్ ఇన్సురెన్సు, ఫ్యాక్టరీస్ తదితర శాఖల ఉద్యోగులు వంద శాతం నమోదు చేసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకున్న వారిలో 70.33 శాతం మంది సమయం వారీగా హాజరువేస్తు న్నారు. మున్సిపాలిటీలలో 431 మంది, ల్యాండ్ అడ్మినిస్ట్రే షన్ శాఖలో 205, పంచాయతీరాజ్‌లో 152, ప్రింటింగ్ ప్రెస్‌లో 109, పశుసంవర్ధకశాఖలో 75, మార్కెటింగ్ శాఖలో 69, వ్యవసాయశాఖలో 68, బిసి సంక్షేమ శాఖలో 66, సెబ్‌లో 64, సాంఘిక సంక్షేమశాఖలో 53, ఆర్అండ్‌బిలో 31, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 28, వాణిజ్య పన్నుల శాఖలో 26 ఇలా పలు శాఖల్లో ఉద్యోగులు ఎస్ఆర్ఎస్ నమోదు చేసినా హాజరు వేయడం లేదు. ఉద్యోగులు ఉదయం 8 నుండి 9 గంటలలోపు యాప్ ఓపెన్ చేసి ముఖహాజరు వేయాలి. ముఖం యాప్‌లో కనపడాలి లేకుంటే హాజరు లేనట్టే. ప్రభుత్వం కేటాయించిన సమయం దాటితే ఆరోజు సెలువు పెట్టుకోవాల్సి వస్తుంది. లేకుంటే గైర్హాజర్ కిందకు వస్తారు. కాబట్టి ఎలాగైనా యాప్‌లో హాజరు వేసుకోవాలని ఉపాధ్యాయులు విశ్వ ప్రయత్నాలు ఇప్పటికీ చేస్తున్నారు. ఇప్పుడు ఈ విధానాన్ని ఉద్యోగులకు అమలు చేయనుండటంతో వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఉపాధ్యాయులు సెల్ ఫోన్‌లు పట్టుకొని నెట్ కోసం అటు ఇటు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడగా ఇప్పుడు ఉద్యోగులు కూడా తమ సెల్‌ఫోన్‌లు పట్టుకుని నెట్‌వర్క్ కోసం తిరగాల్సిన సమస్య ఏర్పడింది. గతంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నా మళ్లీ ఆ విధానాన్నే ఉద్యోగులకు అమలు చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

మనిషిని పోలిన మనుషుల కథే 'అమిగోస్'

- ట్రైలర్ లాంచ్ వేడుకలో హీరో కల్యాణ్‌రామ్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

'మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారు. అలాంటి వ్యక్తుల కథే అమిగోస్' అని హీరో నందమూరి కల్యాణ్‌రామ్ తెలిపారు. శుక్రవారం కర్నూలు నగరంలోని శ్రీరామ థియేటర్‌లో 'అమిగోస్' ట్రైలర్ లాంచ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ... 'తాత గారు రాముడు-భీముడు తీశారు. బాబాయ్ తీశారు. తమ్ముడు ఎన్‌టిఆర్ 'జైలవకుశ' తీశాడు. ఇవన్నీ అన్నదమ్ముల కథలు. కానీ 'అమిగోస్' మాత్రం మనిషి పోలిన మనుషుల కథ' అని తెలిపారు. 2022లో 'బింబిసారా' చిత్రాన్ని ఆదరించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులు కొత్త తరహా చిత్రాలను ఎప్పటికీ ఆదరిస్తారని, ఇప్పుడు ఈ చిత్రాన్ని కూడా ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు నిర్మాతల్లో ఒకరైన యలమంచిలి రవిశంకర్ మాట్లాడుతూ... కర్నూలులో తమకిది మూడో ఫంక్షన్ అని, అన్నీ సినిమాలు సూపర్ హిట్ అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా స్రవంతి వ్యవహరించారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించారు. నూతన దర్శకుడు రాజేంద్ర రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ సినిమా ద్వారా కన్నడ నటి ఆషిక రంగనాథ్ తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు.

బరితెగింపు...

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ విన్యాసాలు
- ప్రతిపక్ష అభ్యర్థుల మద్దతిచ్చే వారిపై నిఘా
- ఉపాధ్యాయ సంఘాల నేతలపై గురి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రానున్న శాసనమండలి ఎన్నికల్లో అధికార పార్టీ తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు బరితెగిస్తుంది. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను మద్దతు ఇచ్చేటువంటి వారిపై నిఘ పెట్టింది. అవసరమైతే వారిని బెదిరించేందుకుగాను సన్నద్ధమయింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు మరియు ఉపాధ్యాయ శాసనమండలి స్థానాలకు మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. అధికార పార్టీ అభ్యర్థులుగా గ్రాడ్యుయేట్ స్థానానికి వెన్నపూస రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయ స్థానానికి రాయపు రామచంద్రారెడ్డి బరిలో నిలిచారు. ప్రతిపక్ష టిడిపి అభ్యర్థిగా భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పిడిఎఫ్ గ్రాడ్యుయేటస్థానానికి పోతుల నాగరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా కొమ్మూరు నాగరాజు తో పాటు మరికొంతమంది బరిలో నిలిచారు. ఉపాధ్యాయ మండలి స్థానానికి పిడిఎఫ్ తరపున కత్తి నరసింహారెడ్డి, తోపాటు నారాయణరెడ్డి, ఒంటేరుశ్రీనివాసులురెడ్డి, చామల అనిల్ వెంకటసుబ్బా రెడ్డి, రామ శేషయ్యలు కూడా బరిలో నిలిచారు. ప్రస్తుత అధికార పార్టీ వ్యవహార సెల్లుపై ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం వేతనాల చెల్లింపుతో పాటు ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ అరియర్స్ వంటివి విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఉపాధ్యాయులు నిరాసక్తితో ఉన్నారు. మరో వైపున ప్రతిపక్ష ఎమ్మెల్సీ అభ్యర్థులకు రోజురోజుకు పెరుగుతున్న ప్రజాధరణకు ఓర్వలేక అధికార పార్టీ తన వ్యూహాలకు మరింత పదును చేస్తుంది. పట్టభద్రులు మరియు ఉపాధ్యాయుల మండలి స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలని అధికార పార్టీ సామ దాన భేద దండోపాయోలకు సన్నదమయింది. గుంటూరు కష్ణా జిల్లాల అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ మండలి నియోజకవర్గంలోనే తిష్ట వేసి ఇక్కడ అధికార పార్టీ అభ్యర్థి గెలుపుకు ఇక్కడే క్యాంపు పెట్టారు. పిడిఎఫ్ తో పాటు ఇతర అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలపై నిగా పెట్టారు. వీరిపై గతంలో నమోదైన తప్పుడు కేసులను మళ్లీ తవ్వి ఫిర్యాదులను విద్యాశాఖ అధికారులకు చేయిస్తూ పరోక్షంగా బెదిరింపులకు దిగుతుంది. అక్రమ కేసులు కూడా బనాయించేందుకు సన్నద్ధమైంది. తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులతో బెదిరింపులకు గురి చేస్తున్నారు. అలాగే పోలీసుల ద్వారా కూడా వీరిపై నిఘా పెట్టించి పాత కేసులను పునరుద్ధరించి వాటిని విచారణ పేరుతో పిలిపిస్తూ ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను గందరగోళ పరిచేందుకు సిద్ధమయ్యింది. అధికార పార్టీ నేతలు ఎన్ని ఎత్తుగడలు వేసినా తప్పనిసరిగా ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఉద్యోగులు ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బకాయిల చెల్లింపుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇబ్బందుల గురిచేస్తుందన్నారు. అధికార పార్టీ బరితెగింపు కు అడ్డుకట్ట వేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్వీపర్ లక్ష్మిని విధుల్లోకి తీసుకోవాలి

- జిజిహెచ్ సూపరింటెండెంట్‌కు ఐద్వా వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి క్యాజువాలిటీలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లక్ష్మిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జిజ నరేంద్రనాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న స్వీపర్ లక్ష్మి తన సహచరురాలికి చెప్పేందుకు వెళితే ఎక్స్‌రే వార్డులో విధులు నిర్వహించే శేషు దుర్భాషలాడి ఉద్యోగం పోవడానికి కారకుడు అయ్యాడని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు స్వీపర్ లక్ష్మిని విధుల్లోకి తీసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. వాస్తవ విషయాలు పరిశీలించి స్వీపర్ లక్ష్మికి న్యాయం చేయాలని సూపరింటెండెంట్‌ను కోరారు.

యుటిఎఫ్ నేతల అరెస్టు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మస్థలిసంకల్ప దీక్షకు వెళ్లిన యుటిఎఫ్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన యుటిఎఫ్ నాయకులను కంకిపాడు పోలీస్ స్టేషన్లో అరెస్టు చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజు, జిల్లా నాయకులు రవికుమార్, హేమంత్ కుమార్, మారెప్ప యెహోషువ, నవీన్ పాటీ లతోపాటు ఇతర మండల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేపట్టిన దీక్షకు కర్నూలు జిల్లా యుటిఎఫ్ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్, ఎల్లప్ప,జయరాజులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేయకుండా అక్రమ అరెస్టులకు పాల్పడడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలని లేకపోతే తగిన గుణపాఠం చెబుదామని వారు హెచ్చరించారు.



పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేపట్టిన దీక్షకు మద్దతు తెలుపుతున్న కర్నూలు జిల్లా యుటిఎఫ్ నాయకులు

విదేశాల్లో ఉన్నత విద్యకు మార్గం సుగమం

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యార్థులకు మార్గం సుగమం అయ్యిందని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సిఎం జగన్‌మోహన్ రెడ్డి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ సుధాకర్, నగర మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దా రెడ్డి రేణుక తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన పేద విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత అందించి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు చేయూత ఇవ్వడానికి జగనన్న విదేశీ విద్యా దీవెన అందజేయడానికి విదేశాలలోని ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు మిగిలిన వారికి గరిష్టంగా రూ.1 కోటి వరకు వంద శాతం అర్హులైన విద్యార్థులు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా మొదటి విడత ఆర్థిక సాయం పొందిన ఇద్దరు విద్యార్థులు (ఎస్సీ-1, మైనారిటీ-1) రూ.8.80లక్షల మెగా చెక్కును జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యే, నగర మేయర్, డిప్యూటీ మేయర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి ప్రతాప్ సూర్య నారాయణ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస రావు లబ్ధిదారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, జడ్పి ఛైర్మన్ పాపిరెడ్డి, మేయర్ రామయ్య



విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పిఎన్ఎం నాయకులు

కె.విశ్వనాథ్ మరణం తీరని లోటు : పిఎన్ఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కళాతపస్వి కె.విశ్వనాథ్ శాస్త్రీయ సంగీతాన్ని సామాన్యునికి పరిచయం చేసిన గొప్ప దార్శి నికుడని, ఆయన మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎంపి బసవరాజు అన్నారు. శుక్రవారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కె.విశ్వనాథ్ శ్రద్ధాంజలి సభ జరిగింది. కె.లోకేష్ అధ్యక్షతన జరిగిన సభలో పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ 1980వ సంవత్సరం ఫిబ్రవరి 2న శంకరాభరణం 2023 ఫిబ్రవరి రెండున ఆయన కన్నుమూయడం యాదృచ్ఛికమే. విశ్వనాథ్ చిత్రాలలోని గీతాలు బసవరాజు రాగమాలికల వినిపించారు. జిల్లా కార్యదర్శి ఇ రాజు మాట్లాడుతూ ఆయన గొప్ప నటుడు, గొప్ప ఆధ్యాత్మికవేత్త అని కొనియాడారు. రాంబాబు రాంబాబు, బాలు, నోమేశ్వరి (చిట్టి), సరిత, లక్ష్మి, రామకృష్ణ, నరసింహ, ఆదర్శ, నాగార్జున పాల్గొన్నారు.

మహాశివరాత్రికి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు, నంద్యాల జిల్లాలకు తలమానికంగా ఉన్న శైవక్షేత్రం శ్రీశైలం మహాశివరాత్రి జాతరను గొప్పగా జరపడానికి ఆర్‌టిసి తరపున చక్కగా, సౌకర్యవంతంగా మరమ్మతులు లేని విధంగా బస్సులు తిప్పడానికి, రెండు జిల్లాల ఆర్‌టిసి అధికారులతో కడప ఎగ్జిక్యూటివ్ డైరక్టరు గోపీనాథ్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బళ్ళారి చౌరస్తా వద్ద గల కర్నూలు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో సమావేశం నిర్వహించారు. శ్రీశైలం వచ్చే యాత్రికుల ప్రయాణం సుఖంగా, సురక్షితంగా జరగడానికి శ్రీశైలం ఘాటులో వెళ్లాల్సిన రెండు జిల్లాల ఘాట్ అర్హత కలిగిన బస్సులను ఎంపిక చేసి, పూర్తిగా తనిఖీ చేసి, బస్సుకు ఘాట్ అర్హత ఉంది అని నిర్ధారణ చేసిన తర్వాతనే, సర్వీసుకు అనుమతిస్తామని తెలిపారు.సుశిక్షితులైన డ్రైవర్లకు ఘాట్ అర్హత డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించి, నిష్ణాతులైన వారిని మాత్రమే శివరాత్రి సర్వీసులకు పంపుతామని అన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం అవసరమైన రోజుల్లో రాత్రి వేళల్లో కూడా తిప్పుటకు సంబంధిత అధికారులను అనుమతి కోరామన్నారు. ప్రయాణీకులు సురక్షితమైన ఆర్టీసి బస్సులలోనే ప్రయాణించాలని కోరారు. కర్నూలు, నంద్యాల ప్రజా రవాణా అధికారులు టికె. వెంకటరామం, శ్రీనివాసులు. కర్నూలు,చిత్తూరు చీఫ్ మెకానికల్ ఇంజనీర్లు, కర్నూలు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రజియా సుల్తానా, కర్నూలు, నంద్యాల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపినాథ్‌రెడ్డి

అక్రమ మద్యం పై విస్తృత దాడులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: అక్రమంగా నాటు సారా తయారీ , నిల్వ , అక్రమ మద్యం, అక్రమ రవాణా, అమ్మకాలపై జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు నెల రోజులుగా జిల్లా పోలీసు యంత్రాంగం, సెబ్ అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విస్తృతంగా దాడులు చేశారని సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణ కాంత్ పటేల్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనకు జిల్లా పోలీసులు సమిష్టిగా జనవరి నెలలో నాటుసారా స్థావరాల పై దాడులు నిర్వహించారన్నారు. నాటుసారా పై దాడుల్లో భాగంగా నాటుసారాపై 38 కేసులు, 61 మంది అరెస్టు , 843 లీటర్ల నాటుసారా సీజ్ , 510 లీటర్ల నాటు సారా బెల్లం ఊట ధ్వంసం చేశారు. 450 కిలోల బెల్లం సీజ్, ఇద్దరు బెల్లం వ్యాపారులు అరెస్టు, 5 వాహనాలు సీజ్ చేశామన్నారు. అక్రమ మద్యంపై 122 కేసులు నమోదు చేసి148 మందిని అరెస్టు చేశామన్నారు. 3,110 లీటర్ల మద్యం , 30 వాహనాలు సీజ్ చేశామన్నారు. నాటు సారా పై 12 మందిని బైండోవర్ చేశామన్నారు. అక్రమ మద్యం పై 14 మందిని బైండోవర్ చేశామన్నారు. షరతులను ఉల్లంఘించిన ముగ్గురిపై రూ. 26 వేలు జరిమానా విధించామన్నారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే అక్రమ నాటుసారా తయారీ , అక్రమంగా మద్యం రవాణా, విక్రయాలకు పలుమార్లు పాల్పడే వ్యక్తులపై పిడి యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



పాడయిన బోర్లను రిపేరు చేయించండి

పట్టణ పౌరసంక్షేమ సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు కార్పొరేషన్ సంస్థలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు బోరింగ్ లే శరణ్యమని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ పుల్లారెడ్డి అన్నారు. నగరంలో వివిధ కాలనీలో లక్షల రూపాయలు వెచ్చించి వేసిన వందలాది బోరింగులను మున్సిపల్ ఇంజనీర్లు పట్టించుకోవడం లదన్నారు. నాగిరెడ్డి రెవిన్యూ కాలనీ హోసన్న మందిరం సమీపంలో 60 అడుగుల రోడ్డు ప్రక్కన బోరింగు శిథిలమై తలకిందలుగా పడి రోజులు గడుస్తున్నా ఇంజనీర్లు, సంబందిత సిబ్బంది స్పందించడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీ అసోసియేషన్ నాయకులు బి.రాధాకృష్ణ విమర్శించారు. ఒక బోరింగ్ వేయాలంటే దాదాపు రూ.లక్ష ఖర్చవుతుందని అన్నారు. నీటి సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు, వేసవిలో నీటి సమస్య ఏర్పడినప్పుడు బోరింగులు ఎంతో ఉపయోగ పడతాయంన్నారం. గతంలో బోరింగులకు రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి రంగులు వేసి శిలుం పట్టకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేవారని, ప్రస్తుతం బోరింగులను విస్మరించా రన్నారు. వేస వికాలం ప్రారంభమైనందువల్ల సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నగరంలోని బోరింగులన్నీ మరమ్మతులు చేయాలని కోరారు.




సెక్యూరిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిఎస్ఆర్ఎంఒకు వినతి ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గురువారం ఒక ఛానల్‌లో కెమెరా మ్యాన్‌గా చేస్తున్న జర్నలిస్ట్‌పై సెక్యూరిటీ గార్డ్స్ అక్కడ ఉండే సెక్యూరిటీ అధికారి దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదనీ అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, పాణ్యం నియోజకవర్గ కార్యదర్శి నీలం సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నగర అధ్యక్షులు శివ కుమార్ అధ్యక్షతన హాస్పిటల్ సిఎస్ఆర్ఎంఒ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శివకుమార్, నాగేంద్ర , నీలం సత్యనారాయణ, కర్నూలు నగర కోశాధికారి నజీర్ బాషా ,జిల్లా కమిటీ మెంబర్ చంద్ర మోహన్‌లు మాట్లాడుతూ ఆసుపత్రిలో అనేక రకాల సమస్యలపై నిరంతరం జర్నలిస్టులు వస్తుంటారని, అలాంటి వారిపై సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా వ్యవహరించం అనుమతులు లేవంటూ ఇష్టాను సారంగా మాట్లాడటంసరికాదన్నారు. ఆసుపత్రి సమ స్యలను, సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బందులపై నిరసనలు చేస్తే మీడియా ప్రచురిస్తుందన్నారు. ఇప్పటికైనా మీడియాపై ఆంక్షలు తగవని అలాంటి చర్యలు ఎవ్వరు చేయకుండా ఆసుపత్రి అధికారులు చర్యలు తీసు కోవాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే ఈ సమస్యపై జిల్లా వ్యాప్తంగా జర్న లిస్టులు ఉద్యమిస్తారన్నారు. కర్నూలు నగర ఉపాధ్యక్షులు విద్యసాగర్, పాణ్యం నియోజకవర్గ ఉపాధ్యక్షులు వి.విజయ్‌కుమార్ సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాగరాజు, మునిస్వామి, గంగాధర్, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, శేఖర్, నజీర్, సలీం మాలిక్, ఆసిఫ్, నజీర్ బాషా, జేమ్స్, కిషోర్, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.



సిఎస్ఆర్ఎంఒకు వినతిపత్రం ఇస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయుకులు

ఫర్టిలైజర్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు నంద్యాల జిల్లాలలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు తనిఖీలను నిర్వహించారని ఆర్‌విఇఒ కె.తిరుమలేశ్వర్ రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా గూడూరు మండలంలోని చౌడేశ్వరి మాత ఫెర్టిలైజర్స్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక ధరలకు యూరియా, డిఎపిని అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు రూ.0. 6 విలువగల 2.038 మెట్రిక్ టన్నుల ఎరువులను, రూ.1.96 లక్షల విలువగల 6.78 మెట్రిక్ టన్నుల డిఎపిని స్వాధీనం చేసుకున్నామన్నారు. షాపు యాజమాన్యంపై సిక్స్ ఎ కేసును నమోదు చేశారు. నంద్యాల జిల్లా కేంద్రంలో న్యూరామకష్ణ అండ్ వాసు వాహిని ఆగ్రో ఏజెన్సీస్‌లో నిర్వహించిన తనిఖీల్లో రూ.2.11 లక్షల విలువగల స్టాక్ వ్యత్యాసం గుర్తించి 14.7 మెట్రిక్ టన్నులను ఎరువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఆర్ఒ ఖాన్ సాహెబ్, ఎఇ చంద్రశేఖర్, ఎఒ రూపస్, పిసి జమాల్ డ్రైవర్ నరసింహ రెండవ బృందంలో శ్రీధర్ ఐఒపి ఎమ్మార్వో వెంకటనారాయణ ఎ. శ్రీనివాసులు పిసి జిలాన్ మధు పాల్గొన్నారు.



చింతలముని నల్లారెడ్డి గుడిలో ప్రముఖులు

ప్రజాశక్తి- సి బెళగల్

సి.బెళగల్ లో చింతల ముని నల్లారెడ్డి నూతన ఆలయం ప్రతిష్ట సందర్భంగా ప్రముఖులు శుక్రవారం మొక్కులు తీర్చుకొన్నారు. వైసిపి ఇంచార్జి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, టిడిపి,వైసిపి నాయకులు , సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ భవన పనుల పరిశీలన

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ లో 60 లక్షలతో నిర్మిస్తున్న సొసైటీ దుకాణ సముదాయాన్ని సింగిల్ విండో ఛైర్మన్ గోపాల్ రెడ్డీ శుక్రవారం పరిశీలన చేశారు. నాణ్యత చూ పాలని గుత్తెదారులకు సూ చించారు. ఈ నెల 16 న ప్రారంభానికి సన్నా హాలు చేస్తున్నట్లు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ రవికుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులను ప్రోత్సహించాలి

- డివైఎఫ్ఐ మాజీ నాయకులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం టోర్నమెంట్లు నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు పిఎస్.రాధాకృష్ణ, నాయకులు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పర్వతాపురం కాలనీలో విజేత జట్టుకు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో వంటి క్రీడల్లో చాలామంది ప్రతిభ చూపినా ప్రోత్సాహం లేక మరుగున పడిపోతున్నారని తెలిపారు. వారి ప్రతిభను ప్రదర్శించేందుకు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ, జిల్లాస్థాయి టోర్నమెంట్ నిర్వహించాలని కోరారు. క్రీడా మైదానాలను ఏర్పాటు చేయకపోవడంతో ఆటలు ఆడేందుకు కూడా అనుకూలంగా లేని పరిస్థితి ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ... విద్యావావరణ యోగేశ్వర జాతర సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించామని తెలిపారు. రాయల్ టీం, కింగ్స్ టీం మధ్య క్రికెట్ పోటి సాగిందని చెప్పారు. కింగ్స్ టీం విజేతగా నిలిచిందని తెలిపారు. డివైఎఫ్ఐ నాయకులు వెంకటేశులు, ఎస్ఎఫ్ఐ నాయకులు గౌస్, గణేష్, పవన్, నాగరాజు, శివ, గౌతం పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న రాధాకృష్ణ

కేంద్రం బడ్జెట్‌తో నిరాశే...

- రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో నిరాశ కలిగిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి అయ్యప్ప, మండల అధ్యక్షులు శేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస్ భవన్ సర్కిల్‌లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో పిఎం కిసాన్ పథకం కింద రూ.68 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు, పంటల బీమా రూ.15,500 కోట్ల నుంచి రూ.13,625 కోట్లకు కోత విధించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీ రూ.2.25 లక్షల వేల కోట్ల నుంచి రూ.1.75 లక్షల వేల కోట్లకు, ఫుడ్ సబ్సిడీ రూ.2.87 లక్షల వేల కోట్ల నుంచి రూ.1.97 లక్షల వేల కోట్లకు కోత విధించారని చెప్పారు. ఉపాధి హామీ రూ.89 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు కోత పెట్టి సామాన్యులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి బడ్జెట్‌లో నిధులు పెంచి రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులును నివారించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌లో మద్దతు ధర చట్టం గురించి కనీసం ప్రస్తావన చేయకపోవడం దారుణమన్నారు. రైతు కూలీల రుణ విమోచన చట్టం గురించి ప్రస్తావన లేదని తెలిపారు. రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న నాయకులు వెంకటేశులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనమందించాలి

- వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని ఎమ్మిగనూరు రహదారిలో ఏర్పాటు చేసిన రవీంద్ర గ్లోబల్ గురుకులంలో నాణ్యమైన భోజనం అందించాలని వైసిపి యువనేత వై.ప్రదీప్ రెడ్డి కోరారు. శుక్రవారం రవీంద్ర గ్లోబల్ గురుకులాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గురుకులంలో మౌలిక వసతులు కల్పించి మంచి గుర్తింపు సాధించాలని సూచించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రవీంద్ర గ్లోబల్ గురుకులం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం శ్రీరాఘవేంద్ర స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని పరిశీలించారు. 3 నుంచి 10వ తరగతి వరకు గురుకులం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. స్థానిక జీనియస్ గ్లోబల్ స్కూల్, శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల కోసం గురుకులం అందుబాటులోకి వచ్చిందని కరస్పాండెంట్ గంగాధర్ రెడ్డి, రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు వై.ప్రదీప్ రెడ్డికి పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, నాయకులు బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డి, కాంతా రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, కాంట్రాక్టర్ జిమ్మి (భీమా) పాల్గొన్నారు.



గ్లోబల్ గురుకులాన్ని ప్రారంభిస్తున్న ప్రదీప్‌రెడ్డి

అనుమతుల్లేకుంటే కఠిన చర్యలు

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-కోసిగి రూరల్

రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను అక్రమంగా లేఅవుట్లు (వెంచర్స్) వేసి ప్లాట్ల అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కోసిగి, నేలకోసిగి, డి.బెళగల్ గ్రామాల్లో తహశీల్దార్ రుద్రగౌడతో కలిసి లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోసిగిలోని సర్వే నెంబర్ 144, 352, 356, 357లో 15 ఎకరాలు, నేలకోసిగిలో సర్వే నెంబర్ 108లో 3.47 ఎకరాలు, 156లో 2.40 ఎకరాలు, 18 సర్వే నెంబర్‌లో 2.90 ఎకరాల భూముల్లో లేఅవుట్ వేశారని తెలిపారు. కర్నూలు కుడా, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి సబ్ రిజిస్ట్రేషన్ వాల్యుయేషన్ ప్రకారం 5శాతం లేఅవుట్ పన్నుతో పాటు ఆదనంగా 5శాతం పన్ను విధించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.10 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. పెనాల్టి ఫీజు చెల్లించిన తర్వాత అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎస్ఐ తిక్కస్వామి, సర్వేయర్ బసవరాజు, విఆర్ఒలు పాల్గొన్నారు.



కోసిగిలో లేఅవుట్ రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కౌతాళం

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎరిగేరి గ్రామంలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా సేవలను ఏ విధంగా అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇలా నిర్మాణాలు వేగవంతం లేకపోవడంతో ఇంజినీర్ అసిస్టెంట్ పని తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రేషన్ కార్డు యాడింగ్ విషయంలో విఆర్ఒను ప్రశ్నించారు. గరుడ యాప్‌ను సిబ్బంది ఉపయోగించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరును మార్చుకొని ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఉరుకుంద, హాల్వి గ్రామాల్లో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలని రైతులు దరఖాస్తు చేసుకోవడంతో ఆ భూములను పరిశీలించారు. కౌతాళం తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, విఆర్ఒ బసవరాజ్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



కౌతాళంలో భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న చైర్మన్ దంపతులు

వైభవంగా కౌలుట్ల స్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో ప్రసిద్ధి చెందిన కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో ఛైర్మన్ హనుమంతు రెడ్డి, వైసిపి మండల నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకౌలుట్ల, శ్రీదేవి, భూదేవిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం నిర్వహించి ఊరేగింపు చేపట్టారు. పత్తికొండ సిఐ రామకృష్ణారెడ్డి, దేవనకొండ, మద్దికెర ఎస్ఐల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'అప్పర్ భద్ర'తో రాయలసీమ ఎడారి

- రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలి

- రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'అప్పర్ భద్ర' ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారిగా మారుతుందని, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్యాకేజీ ఇవ్వాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం పట్టణంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ నాగన్న మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమకు న్యాయం చేయకపోగా తీవ్ర అన్యాయానికి గురి చేసే కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఆమోదం తెలపడం దారుణమని మండిపడ్డారు. రాయలసీమలోని ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యార్థి సంఘాల నాయకులు ఖాజా, నల్లారెడ్డి, కృష్ణ, హరి, రైతులు రామన్న, వీరేష్, లింగన్న పాల్గొన్నారు.

పెద్దతుంబలం ఆస్పత్రిని 50 పడకలుగా నిర్మించండి

- జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దతుంబలం ఆస్పత్రిని 50 పడకలుగా నిర్మించాలని జనసేన నాయకులు ఎం.తాహేర్ వలీ, పులి రాజు, ప్రకాష్ కోరారు. శుక్రవారం జనసేన ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి పరిశీలనలో భాగంగా మూడో రోజూ పెద్దతుంబలం ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ ఆస్పత్రిలో రోజూ 150 నుంచి 200 వరకు ఒపి ఉంటుందని తెలిపారు. ప్రతి నెలా 200 వరకు సాధారణ డెలివరీలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఆస్పత్రికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. ఈ ఆస్పత్రికి రోడ్డు సౌకర్యం అందుబాటులో ఉండడంతో ప్రజలు రావటానికి వీలుందని చెప్పారు. 50 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే అసెంబ్లీలో లేవనెత్తాలని కోరారు. జనసైనికులు వీరేష్, ఆరిఫ్, అలీ, వెంకటేష్, అజయ్, దాసప్ప, తాయన్న, రామ్ రెడ్డి, బంగారయ్య, రాజు, ఈరన్న, బాష పాల్గొన్నారు.

అన్నదానానికి ఏర్పాట్లు పూర్తి

- అల్వారు మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

శివరాత్రి సందర్భంగా ఆదోని మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే శివభక్తు అన్నదానానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అల్వారు మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈనెల 9 నుంచి 13 వరకు ఆదోనిలోని ఎమ్మిగనూర్ బైపాస్ దగ్గర దాతల సహాయంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కామవరం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న హనుమంతు రెడ్డి 50 ప్లేట్లు, 50 గ్లాసులు, 4 జగ్గులు విరాళంగా ఇచ్చారని చెప్పారు. మరిన్నీ వివరాలకు 7989346355, 9949197152 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



నిర్వాహకులకు ప్లేట్లు అందిస్తున్న విజయ్‌కుమార్ స్వామి

అందరి సహకారంతో మండలాభివృద్ధి

- ఎంపిపి జట్టప్పగారి రంగమ్మ

- ఆలూరు ఎంపిపిగా ప్రమాణ స్వీకారం...

ప్రజాశక్తి-ఆలూరు

మంత్రి గుమ్మనూరు జయరామ్, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఆలూరు ఎంపిపి జట్టమ్మగారి రంగమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేకాధికారి శాంతన్న ఆధ్వర్యంలో ఎంపిపి ఎన్నికను చేపట్టారు. గత ఆరు నెలల క్రితం వైసిపికి చెందిన ఎంపిపి సుభాషిణి (బేబమ్మ) అనారోగ్యంతో మృతి చెందారు. వైస్ ఎంపిపి కురువ శ్రీరాములు ఇన్‌ఛార్జీ ఎంపిపిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎస్సీ రిజర్వ్ అయిన ఎంపిటిసిలు కమ్మరచేడు జట్టమ్మగారి రంగమ్మ, ఎం.కొట్టాల ఎంపిటిసి ఉండగా వైసిపికి చెందిన 11 మంది ఎంపిటిసిలు కలిసి ఎంపిపిగా జట్టమ్మగారి రంగమ్మకు మద్దతు తెలిపారు. ఎన్నికల ప్రత్యేకాధికారి శాంతన్న, ఎంపిడిఒ అల్లాబకాష్ ఆధ్వర్యంలో జట్టమ్మగారి రంగమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి, జడ్‌పిటిసి ఏరూరు శేఖర్, వైసిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ వీరేష్ పాల్గొన్నారు.



ఎంపిపి రంగమ్మను సన్మానిస్తున్న మంత్రి సోదరులు, జడ్‌పిటిసి

'టిడిపి అభ్యర్థిని బలపరచండి'

ప్రజాశక్తి - చిప్పగిరి

టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి వెంకటరెడ్డిని బలపరచాలని టిడిపి కన్వీనర్, అడ్వకేట్ రాయచూరు షేక్షావలీ పట్టభద్రులను, ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు మండలంలోని చిప్పగిరి, నేమకల్లు, రామదుర్గం, నగరడోనా, బెల్డోన తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. టిడిపి కన్వీనర్ షేక్షావలీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి వెంకటరెడ్డి బావమరిది శంకర్ రెడ్డి, టిడిపి మాజీ కన్వీనర్ నగరడోనా కిష్టప్ప, టిడిపి జిల్లా యువ అధికార ప్రతినిధి సోమశేఖర్ నాయుడు టిడిపి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలిసి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. టిడిపి నాయకులు, మండల ఉపాధ్యక్షులు సతీష్, మాజీ ఎంపిటిసి గోవిందు పాల్గొన్నారు.

'అమరావతి జెఎసి మహాసభను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 5న కర్నూలులో జరగనున్న ఎపి అమరావతి జెఎసి మహాసభను జయప్రదం చేయాలని జెఎసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎస్.మస్తాన్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎపిసిఒఈ సంఘం అమరావతి జెఎసికి అనుబంధంగా పని చేస్తుండడంతో కర్నూలులో బొప్పరాజు వెంకటేశ్వర్లు, కె.సుమన్ నాయకత్వంలో జరుగుతున్న మహాసభకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. ప్రభుత్వ రంగాల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి గరిష్ఠ ధర క్వింటా రూ.8,120 పలికింది. గురువారం కంటే రూ.20 పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా పత్తి కనిష్ఠ ధర రూ.4,911, మధ్య ధర రూ.7,860 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 242 (940 క్వింటాళ్లు) లాట్ల పత్తి వచ్చినట్లు పేర్కొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

- వ్యకాస, ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని వ్యకాస మండల అధ్యక్షులు జి.రంగనాథ్ కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉపాధి పనుల దగ్గరికి వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 8, 10 వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు చెల్లించాలని ఈనెల 7న ఆదోని ఎంపిడిఒ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉపాధి వేతనాలు రెండు నెలలుగా అందడం లేదని తెలిపారు. వెంటనే వేతనాలు చెల్లించి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలని, ఉపాధి హామీ వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు 7న జరిగే ధర్నాలో కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధి కూలీలు



పూజలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

వైభవంగా శివలింగ పునఃప్రతిష్ఠాపన

- టిడిపి నాయకుల పూజలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో వెలసిన శ్రీరుక్మిణి పాండురంగ స్వామి దేవాలయంలో శివలింగం పునఃప్రతిష్ఠాపన శుక్రవారం వైభవంగా సాగింది. స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, ఆకు పూజతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఫుడ్ కమిషన్ మాజీ సభ్యులు, టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, ఎల్ఎల్‌సి మాజీ ఛైర్మన్ రామస్వామి, సోమశేఖర్ రెడ్డి, ఎమ్‌డి.హుస్సేన్, సాధిక్ వలీ, పువ్వనూరు మల్లేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్ఐసి రఘు, అనిల్, దేవాలయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

వెంకటేశ్వర స్వామి గోపుర కలశ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలో వందవాగిలి గ్రామంలో వెంకటేశ్వర స్వామి నూతన గోపుర కలశ ప్రతిష్ఠాపన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గంగి పూజలో భాగంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు బీరప్ప డోళ్లు, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్తూ గోపూజ, విష్ణు సహస్రనామ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు హోమం చేపట్టారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ అబ్దుల్ జహీర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.




గంగి పూజలో పాల్గొన్న మహిళలు

శ్రీబసవేశ్వర కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీబసవేశ్వర కల్యాణ మండపాన్ని బిచ్చాల, మఠమారి మఠాల పీఠాధిపతి వీరభద్ర శివాచార్య స్వామి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ బీసీ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్‌లు ప్రారంభించారు. అనంతరం రుద్రగౌడ్ మాట్లాడుతూ... వీరశైవులు సామాజికావృద్ధి సాధించాలని తెలిపారు. తిమ్మాపురంలో వీరశైవులు అందరూ కలిసి కమ్యూనిటీ హాలును నిర్మించుకోవడం హర్షణీయమని చెప్పారు. అమరావతి హోటల్స్ అధినేత పల్లారాముడు, ఐటిసి డిస్ట్రిబ్యూటర్ ప్రొప్రైటర్ వై.పురుషోత్తం గౌడ్, సామాజిక కార్యకర్త, మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ప్రెడ్ రాజు, స్పిన్నింగ్ మిల్ ఎమ్‌డి బళ్లారి నీలప్ప, ప్రముఖ న్యాయవాది కె.లక్ష్మీనారాయణ రెడ్డి, ఎమ్మిగనూరు పట్టణ వీరశైవ లింగాయత్ సంఘ అధ్యక్షులు వజ్రగిరి రాచోటప్ప, కార్యదర్శి మామిడి మల్లికార్జున, శ్రీలక్ష్మీ ట్రేడర్స్ ఓనర్ బి.నాగరాజు, కనకవీడు వీరభద్ర స్వామి, గోనెగండ్ల మండల వీరశైవ లింగాయత్ సంఘ నాయకులు కె.వీరన్న, శ్రీపరిమళ ప్లేట్స్ ఓనర్ ఈరన్న, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి జిబి.నాగరాజు గౌడ్ మాట్లాడారు. వీరశైవులకు ఎప్పటికీ తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కల్యాణ మంటపం నిర్మాణానికి ఆర్థిక, సహాయ, సహకారాలు అందించిన వారిని ఘనంగా సన్మానించారు. వీరశైవ లింగాయత్ సంఘం ఎమ్మిగనూరు నాయకులు కె.పరమేశ్, మూర్తి, వ్యవస్థాపకాధ్యక్షులు బీసీ.నాగరాజు, అధ్యక్షులు బి.పెద్ద బసన్న, కార్యదర్శి బి.పెద్ద రామలింగప్ప, నాయకులు బిటి.చిన్నన్న, కె.ఉరుకుంద పాల్గొన్నారు.



రుద్ర గౌడ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పెద్దలు

మున్సిపల్ ఎస్‌జిటిలకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి

- యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఎస్‌జిటిలకు ఐదు నెలల ఇంక్రిమెంట్ల మంజూరు కోసం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని యుటిఎఫ్ పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ రాజ్ కుమార్, గిరి బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కమిషనర్, ఎంఇఒ ఒకరిపైఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేయడం సరికాదన్నారు. ఐదు నెలలుగా మున్సిపల్ ఎస్‌జిటిలకు ఇంక్రిమెంట్లు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. డిఇఒ ఆదోని మున్సిపల్ ఉపాధ్యాయుల 5 నెలల ఇంక్రిమెంట్ల మంజూరుకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. లేకపోతే డిఇఒ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. నాయకులు మల్లికార్జున, జగన్మోహన్, రూహుల్ అమీన్, జహంగీర్, రుషి కేశవ్, నాగేష్, చక్రపాణి, ఇమ్రాన్, సాధిక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి హామీ పథకంలో భారీగా అవకతవకలు

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ -అధికార పార్టీలోని ఇరువర్గాల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ తూతూ మంత్రంగా సాగింది. భారీగా అవకతవకలు జరిగినట్లు కూలీలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్వహించిన సామాజిక తనిఖీ అనుమానాలకు తావిస్తోందని కూలీలు పేర్కొంటున్నారు. అవకతవకలు జరిగినట్లు అధికార పార్టీలోని రెండు వర్గాలు బహాబాహికి దిగాయి. స్థానిక కార్యాలయంలో 16వ సామాజిక తనిఖీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సామాజిక తనిఖీ అధికారులు సభలో వారికివారే మాట్లాడుకుంటున్నారు తప్ప గ్రామాల నుంచి వచ్చిన ఉపాధి కూలీలకు, సర్పంచులకు వివరాలు వెల్లడించలేదుని ప్రజలు అన్నారు. 12 గ్రామపంచాయతీలో గాను రికవరీ 928183 చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆ ఆర్ జి ఎస్ పిడి రామచంద్రారెడ్డి, భాస్కర్ నాయుడు, విజిలెన్స్ అధికారి పకీరప్ప, ఎంపిడిఒ మంజుల వాణి అధికారులు తదితరులు పాల్గొన్నారు. తాటిపాడు గ్రామపంచాయతీలో జరిగిన ఉపాధి పనుల గురించి రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కొందరు పనికి రాకున్నా మస్టర్లు వేసుకున్నారని గ్రామ సర్పంచులు లక్ష్మీదేవమ్మ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై సిద్ధార్థ రెడ్డి , ఎమ్మెల్యే ఆర్థర్ వర్గాలు ఘర్షణ పడ్డాయి.ఉపాధి హామీ సామాజిక తనిఖీ గంటలోపే పూర్తి చేయడం పట్ల సిపిఐ నాయకులు ఆందోళనకు దిగారు. గతంలో దాదాపు 7 గంటల పాటు నిర్వహించే సామాజిక తనిఖీ ఇప్పుడు గంటన్నర లోపే ముగించడం అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ విషయంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని, మళ్లీ సామాజిక తనిఖీ నిర్వహించాలని డిమాండు చేశారు.



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న హరివరం సచివాలయ ఉద్యోగులు

ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని హరివరం గ్రామ మహిళా ఉద్యోగులపై గ్రామంలోని ఓ వైసిపి నాయకుడు దౌర్జన్యం చేస్తున్నాడని ఎంపిడిఒ మహేశ్వర రావుకు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ వైసిపి నాయకుడు సచివాలయానికి మద్యం తాగి వచ్చి తమపై దౌర్జన్యం చేస్తూ దుర్భాషలాడుతున్నారని, గతంలో తమకు ఫిర్యాదు చేసిన ఆ వ్యక్తులు ఎలాంటి మార్పు రాలేదన్నారు. దీంతో తమకు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయం వేస్తుందని ఎంపీడీవో ముందు కన్నీటి పర్యంత మయ్యారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ప్రేమలత, శిరీష, సురేఖ, పాల్గొన్నారు.

5న జిల్లా ఒలంపిక్ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

భారత ఒలంపిక్ అసోసియేషన్ చే గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఆదివారం ఉదయం 10 గంటలకు రాజువిహార్ సెంటర్లోని కెఇ ప్లాజా గుర్తింపు పొందిన క్రీడా సంఘాల సమావేశం జరగనుందని కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ కెయి.ప్రభాకర్ తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన 24 క్రీడాంశాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు తమ లెటర్ ప్యాడ్‌తో తప్పక హాజరు కావాలని జిల్లా సంఘం చైర్మన్ కెఇ ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ చే గుర్తింపు పొందిన 24 క్రీడాంశాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. స్విమ్మింగ్, బాక్సింగ్, జూడో, తైక్వాండో, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖో -ఖో, ఫుట్ బాల్, వాలీబాల్, ఫెన్సింగ్, బాస్కెట్ బాల్ , సెపక్తక్రా, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, రైఫిల్ షూటింగ్, త్రయతలాన్ ,మోడరన్ పెంటాతలాన్,బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, స్క్వాష్ రాకెట్, రగ్బీ, ఉషు, యాచింగ్, 5న జరిగే ఎన్నికలలో తప్పనిసరిగా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని తమ్మ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. 4న నగరంలో జరిగే ఎన్నికలకు తమ సంఘానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నా మన్నారు. 5న ఎన్నికయ్యే కార్యవర్గం నాలుగేళ్ల పాటు కొనసా గుతుందని, జిల్లాలో జరిగే ఒలంపిక్ అసోసి యేషన్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొం టారని పేర్కొన్నారు. ఎన్నికలకు కడప జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు సమరనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఒలంపిక్ సంఘం తరుపున పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.



మాట్లాడుతున్న పరిశోధన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం

మామిడి సాగులో సమగ్ర సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని పెద్దపుదిల్లా గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ నంద్యాల జిల్లా వారి సౌజన్యంతో డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డ్ మెంబర్ సుమిత్ర, సర్పంచ్ బండి ఉషారాణి అధ్యక్షతన మామిడి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహానంది పరిశోధన స్థానం నుండి సుబ్ర హ్మణ్యం శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా స్థానం అనంతరాజుపేట శ్రీధర్ శాస్త్రవేత్త పాల్గొని సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు మాట్లాడుతూ ఉద్యాన పథకాల గురించి రాయితీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర రెడ్డి, గ్రామ పెద్ద రామిరెడ్డి, హనుమంత్ రెడ్డి, ఉద్యాన అధికారి జి కళ్యాణి, మండల వ్యవసాయ అధికారి షేక్షావలి, ఆర్‌బికె సిబ్బంది మౌలాలి, దస్తగిరి, రమేష్ పాల్గొన్నారు.

భారత్ జూడో యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందికొట్కూరు

దేశంలో రైతుల పక్షాన నిలబడేది కాంగ్రెస్ పార్టీ అని ,కాంగ్రెస్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ అన్నారు. నందికొట్కూరు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు అశోకరత్నం ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వ హించారు. మస్తాన్ వలీ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన నడుస్తోందన్నారు. బడ్జెట్ లో ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కేసులకు భయపడి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నోరు విప్పడంలేదని, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా కేంద్రానికి భయపడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర ను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలో 'చేయి చేయి కలుపుదాం' అనే కార్యక్రమం జనవరి 26 నుండి ఈ నెల 26 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కరయ్య, మధు యాదవ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ చేసుకోవాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని రైతు సోదరులు రబీ సీజన్లో సాగుచేసిన తమ పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల ద్వారా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం వారు మట్లాడుతూ పథకాలు వర్తించాలంటే ఈ క్రాప్ తప్పనిసరి పేర్కొన్నారు.

ఎయిడెడ్ స్కూల్స్ గౌరవ అధ్యక్షులుగా ఆర్ఎస్ఆర్ గోపాల్

ప్రజాశక్తి - పాములపాడు

ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆత్మకూర్ డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా పాములపాడు చెందిన శ్రీ వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ రాయపాటి సీతారాం గోపాల్ గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరాముడు వాసవి దస్తగిరి ఆర్ ఎస్ ఆర్ గోపాల్‌ను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డివిజన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఆర్ఎస్ఆర్ గోపాల్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ స్కూళ్ళ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, వాసవి దస్తగిరి, కోశాధికారి సుబ్బయ్య, క్రమశిక్షణ కమిటీ సభ్యులు భాస్కర్, మద్దిలేటి, విద్యాసంస్థల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు : ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి - మహానంది

మహాశివరాత్రికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని మహాశివరాత్రి ఉత్సవాల ప్రత్యేక అధికారి రానా ప్రతాప్ తెలిపారు. శుక్రవారం మహానంది పుణ్యక్షేత్రంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను ఈఓ చంద్రశేఖర్ రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా స్వామి అమ్మవార్లను దర్శించుకునేల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రసాదాల కౌంటర్, క్యూ లైన్లు తదితర వాటిని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట మద్దిలేటి స్వామి ఆలయ ఈ ఓ పాండురంగారెడ్డి, కొత్తూరు సుబ్బారాయుడు స్వామి ఆలయ ఈఓ రామకష్ణ, నంద్యాల డి ఈ ఓ సుధాకర్ రెడ్డి, మహానంది ఎ ఈ ఓ మధు, సూపర్ డెంట్లు వెంకటేశ్వర్లు, శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరినాద్, వెంకటేశ్వర్లు తదితరులు వున్నారు.

విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రవ్వల కొండ మోడల్ స్కూల్ మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాల బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పి ఎ.రమేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలుకుతున్న స్థానికులు

సమస్యలు పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజల ముందుకు వస్తున్నామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్‌జె. సుధాకర్ అన్నారు. కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, సర్పంచి విద్యాసాగర్‌తో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేకు పూలమాలలు హారతులతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రజలను ఆప్యాయతంగా పలకరిస్తూ, లబ్ధి పొందిన వారికి సంక్షేమ పథకాల బుక్‌లెట్స్‌ను అందించి సంక్షేమ పథకాల అవగాహన కల్పించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ఇళ్ల వద్దకే పథకాలు వచ్చేలా జగనన్న పాలన సాగుతోందన్నారు. జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరొక్కమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు సత్యారెడ్డి, శ్రీధర్, మాజీ ఉపాధ్యక్షుడు వాసు, సుధాకర్, షేక్ కలాం, పశువుల సుధాకర్, గంజిల్లా మాదన్న, ప్రతాప్, పశువుల రాముడు, మండల అధికారులు ,సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

సి బెళగల్‌లో అవీ - ఇవీ

ప్రజాశక్తి-సి బెళగల్

మలేరియా నిర్మూలన జిల్లా అధికారి నూకరాజు శుక్రవారం ఈర్లదిన్నెను సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల పరిషత్ అధికారి ఇఒఆర్‌డి సందీప్‌ను,సిబ్బందిని కోరారు.యనగండ్ల గ్రామంలో ముక్కంటేశ్వరాలయంలో విష్ణుసేనా యువత గోపి సమక్షంలో పలువురు తారకరత్న కోలుకోవాలని, నారాలోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేశారు.సి బెళగల్ మోడల్ స్కూల్లో ఎంపిడిఒ రాముడు ప్రిన్సిపల్ వంశీమోహన్ సమక్షంలో మిడ్ డే మీల్స్ ను తనిఖీ చేశారు. అనంతరం విద్యతో పాటు క్రమశిక్షణతో మెలగాలని సమీక్షలో పేర్కొన్నారు. ఈర్లదిన్నెలో గ్రామ పెద్దలు ప్రతాప్ సమక్షంలో, మారందొడ్డిలో జూలకంటి లక్ష్మన్న సమక్షంలో ఎల్లమ్మ పండుగలు ఘనంగా జరిగాయి. వ్యవసాయ కేంద్రంలో ఎఒ మల్లేష్ కుమార్ మండల సలహా కమిటీ మేరకు జిప్సం,జింకు,విత్తనాలకై,సబ్సిడీ పనిముట్లకు ప్రభుత్వానికి నివేదికలు పంపిటున్నట్లు మీడియాలో పేర్కొన్నారు.

6న జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్ : ఈ నెల 6న స్థానిక ఔట్ డోర్ స్టేడియంలో నందు జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల విభాగంలో షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఈశ్వర్ నాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10 నుంచి 13 వరకు విజయవాడ లోని హనుమాన్ జంక్షన్ జరిగే 41వ సీనియర్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కర్నూలు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. మరిన్ని వివరాలకు 9989982655 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలన్నారు.



ఎస్‌సి నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులు ఎందుకు

డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కోడుమూరు నందికొట్కూరు ఎస్‌సి నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలు ఉండగా ఇన్‌ఛార్జులను ఎందుకు నియమించారని డిసిసి అధ్యక్షుడు సుధాకర్‌బాబు ప్రశ్నించారు. నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులకు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం డిసిసి కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా నాయకంటి బజారన్నను నియమించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధాకర్‌బాబు పాల్గొని బజారన్నకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపెట్టన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ఒక పైసా నిధులను కేటాయించలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులను కూడా ఇవ్వలేదన్నారు. కేంద్రం మెడలు వంచుతానని ప్రకటించిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు ఏం చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. బజారన్న మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీని అభివృద్ధి చేస్తానన్నారు. అనేక సంవత్సరాల పాటు ఎస్‌సి ఉద్యోగ సంఘం నాయకుడుగా చేశానన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు బతుకన్న, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాన్ విల్సన్ ,మైనార్టీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు : డిహెచ్‌పిఎస్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్



సాంఘిక ఆర్థిక వెసులుబాటుకు గురైన దళిత ప్రజల అభ్యున్నతి కోసం జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు జరపాల్సిన కేంద్ర ప్రభుత్వం వారి సంక్షేమాన్ని విస్మరించిందని డిహెచ్‌పిఎస్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఎస్.మునెప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల హక్కుల పోరాట రాష్ట్ర సమితి డైరీని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి శ్రీనివాసకుమార్ ఆవిష్కరించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టానికి పూర్తిగా చట్టబద్ధత కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ప్రత్యక్ష ప్రయోజనాలకు ఉపయోగపడేలా దళిత వాడల అభివృద్ధిలో కొద్దో గొప్పోమేలు జరిగిందన్నారు. చట్టం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా పరిశీలన చేస్తే కేటాయించిన నిధులలో కేవలం 54.5శాతం ఖర్చు చేశారన్నారు. ఏ ప్రభుత్వాలు మారినా ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేశారన్నారు. 2019-20 బడ్జెట్లో సబ్ ప్లానుకు రూ.15000 వేల కోట్లు కేటాయించి, ప్రత్యక్ష ప్రయోజనాల కోసం మాత్రమే ఖర్చు చేయాల్సిన ఈ నిధులను నవరత్నాల కోసం రూ.7257 వేల కోట్లను, ఇతర సాధారణ పథకాల కోసం రూ.2064వేల కోట్లు మొత్తంగా రూ.9422 వేల కోట్లను దారి మళ్ళించారన్నారు. మరోవైపు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అమలు చేసే పథకాలను నిలుపుదల చేశారన్నారు. రుణాలు ఇచ్చే కార్పొరేషన్లకు రూపాయి నిధులు లేవన్నారు. భూమి కొనుగోలు పథకం, విదేశీ విద్య, వ్యవసాయ బోర్లు, చిన్న పరిశ్రమలలాంటి వాటికి మంగళం పాడారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి కోసం పాటుపడాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సి.కుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సచివాలయం ద్వారా గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి-తుగ్గలి

సచివాలయానికి ద్వారానే గ్రామాలు పూర్తిగా అభివృద్ధి జరుగుతుందని బొందిమడుగుల సచివాలయం కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాలు గ్రామాలలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అదేవిధంగా పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, తుగ్గలి, పత్తికొండ, క్రిష్ణగిరి, వెల్దుర్తి తదితర మండలాల్లో వివిధ అభివృద్ధి పనులను చేశామన్నారు. ఆ అభివృద్ధి చేసిన పనులే మరల ఎమ్మెల్యేగా ఆమెని గెలిపిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రజల కోసం అహర్నిశలు ఎమ్మెల్యే శ్రీదేవి కష్టపడుతుందన్నారు. గడపగడపలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు.

అప్రమత్తత చర్యలపై అవగాహన : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పరిశ్రమల్లో ఊహించని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలకు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు..శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు కూడా అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పరిశ్రమలు ఒక యూజర్ మాన్యువల్‌ను రూపొందించి, డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సభ్యులకు అందచేయాలన్నారు.

రైతు భరోసా కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రైతులకు మంచి సేవలు అందించేలా రైతు భరోసా కేంద్రాల పనితీరు మెరుగు పడాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వైఎసఆర్ యంత్ర సేవ పథకం కింద ఏర్పాటు చేసిన 114 గ్రూపులకు బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయించలన్నారు. రైతు ఆత్మహత్యలకు సంబంధించిన పరిహారం చెల్లింపులో జాప్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో చిరుధాన్యాల సాగును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..



హసీనాబీని అభినందిస్తున్న ప్రిన్సిపల్ వివి సుబ్రహ్మణ్యకుమార్ , తదితరులు

చరిత్ర అధ్యాపకురాలకు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకురాలు హసీనాబీ ఇటీవల రాష్ట్ర హిస్టరీ కాంగ్రెస్‌లో ప్రతిభ చూపడంతో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్య కుమార్ శుక్రవారం అభినందించారు. ఈ మేరకు ఆమెకు వచ్చిన అవార్డు నగదును కళాశాల స్మారక రాళ్ల బండి సుబ్బారావు జ్ఞాపకార్థ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రశంసా పత్రాన్ని కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ప్రసాద్ రెడ్డి విమల రోథ్, నాగన్నలు ప్రశంసించారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు టౌన్ మోడల్ పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తయారు చేసిన 125 నుండి 150 రకాల ప్రదర్శనలు ఎగ్జిబిషన్‌లో ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. వాటిలో 5 అంశాల వారీగా1.పర్యావరణ హిత పదార్థాలు, వాతావరణ మార్పులు, గణితము, ఆరోగ్యం, సాఫ్ట్ వేర్ యాప్స్ ఉంటాయి. ప్రతి అంశంలో రెండు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు పంపుతామన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

నేడు అంతర్జాతీయ క్యాన్సర్ నివారణ దినోత్సవం -డాక్టర్ ఎస్‌జె. జానకిరామ్, కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ జిఐ ఆంకాలజీ,కిమ్స్ హాస్పిటల్స్, కర్నూలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

'ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 4 న క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. కాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ఈరోజును ప్రపంచ క్యాన్సర్ రోజుగా జరుపుకుంటున్నాం. క్యాన్సర్ పై అవగాహన లేక ఏర్పడే భయం రోగిని కుంగదీస్తోంది. ఫలితంగా ప్రాణాలమీదకు వస్తోంది. చక్కటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, మెరుగైన జీవనశైలిని అలవర్చుకుని, మేలైన వైద్యచికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను ఎదుర్కోవడం సులభమే. ప్రస్తుత రోజుల్లో వయసుతో, అలవాట్లతో సంబంధం లేకుండా క్యాన్సర్ బారినపడుతున్నారు." అని డాక్టర్ ఎస్‌జె జానకిరామ్. ఆయన మాటల్లో... క్యాన్సర్ గురించి తెలుసుకుందాం.....

క్యాన్సర్ అంటే: మనిషి శరీరంలోని కణజాలం, ఏ అవయవంలోనైనా సరే ఒక నిర్దిష్ట క్రమంలో కాకుండా హానికరమైన, అపరిమితంగా పెరగడమే క్యాన్సర్. ఇది శరీరంలో ఏ భాగానికైనా రావచ్చు. శరీరంలో ఏ భాగంలో క్యాన్సర్ సోకుతుందో దానికి ఆ అవయవ క్యాన్సర్‌గా చెబుతుంటాం. ఏ భాగానికి ముందుగా క్యాన్సర్ వచ్చిందో దానిని ప్రైమరీ క్యాన్సర్ అంటారు. ఇక క్యాన్సర్ అన్నది ఆ భాగానికే పరిమితం కాకుండా అలా ఎటుపడితే అటు విస్తరిస్తుంది. ఇలా క్యాన్సర్ పెరగడాన్ని 'మెటా స్టాసిస్' అంటారు. క్యాన్సర్ దగ్గరి సంబంధం ఉన్న అనేక వ్యాధుల సముదాయం. శరీర నిర్మాణానికి అవసరమైన కణాల్లో మొదలవుతుంది. ఈ కణాలు పెరిగి విభజన చెందుతాయి. శరీరానికి అవసరం లేకపోయినా, కొత్త కణాలు ఏర్పడతాయి. పాతకణాలు క్షీణించాల్సిన సమయంలో క్షీణించవు. ఈ విధంగా ఏర్పడిన కణాల సముదాయం కంతి మాదిరి ఏర్పడతాయి. దీనిని క్యాన్సర్ గడ్డ అని పిలుస్తారు. వాస్తవానికి ఈ కంతులు అన్నీ అపాయమైనవి కావు. నిరపాయకరమైన కంతులను శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చు. క్యాన్సర్ లక్షణాలు దాని రకంపై ఆధారపడి ఉంటాయి. చిన్న పరిమాణపు క్యాన్సర్ లేదా ప్రాథమిక దశల్లో ఉన్నవాటికి చికిత్స చేయడం సులభం. మెటాస్టాటిక్ క్యాన్సర్ల పర్యవసానాలు చాలా తక్కువగా ఉంటాయి. దీనిలో క్యాన్సర్ వ్యాప్తిని పూర్తిగా నివారించలేం. శరీర వ్యవస్థల వైఫల్యాలు లేదా ఇతర సమస్యలకు దారితీయవచ్చు. రోగనిర్ధారణ కణితి రకాన్ని బట్టి , ప్రభావితమైన శరీర భాగాన్ని బట్టి కూడా ఉంటుంది.

క్యాన్సర్ లక్షణాలు : ముక్కు , నోటి నుంచి రక్తం కారడం, గడ్డలు ఏర్పడడం క్యాన్సర్ లక్షణాలు.

రొమ్ము క్యాన్సర్: రొమ్ము ముద్ద, చనుమొన ద్రవం కారడం, చర్మంలో మార్పు. ప్రేగుల్లో బల్లలు ఏర్పడడం, పురీషనాళంలో నొప్పి.

ఊపిరితిత్తుల క్యాన్సర్: నిరంతర దగ్గు, కఫంలో రక్తం, ఛాతీ నొప్పి.

బ్రెయిన్ క్యాన్సర్: భరించలేని తలనొప్పి, వికారం, వాంతులు, అవయవాలలో బలహీనత.

కాన్సర్ కణజాలం యొక్క అంచనా ద్వారా క్యాన్సర్ దశలు నిర్ధారించబడతాయి. ప్రాణాంతక కణితి గుర్తించిన తర్వాత, కణితి స్వభావాన్ని తెలుసుకోవడానికి, చికిత్సా ప్రణాళికను అంచనా వేయడానికి 'గ్రేడింగ్' 'స్టేజింగ్' అనే రెండు పద్ధతులు ఉపయోగిస్తారు. గ్రేడింగ్ అనేది హిస్టోలాజిక్, దీనిలో కణజాలం (టిష్యూ) మైక్రోస్కోప్ ద్వారా అధ్యయనం చేస్తారు. స్టేజింగ్ అనేది వైద్యసంబంధమైనది. సాధారణ పరీక్ష ద్వారా గుర్తించబడుతుంది.

క్యాన్సర్ కు చికిత్స: క్యాన్సర్‌కు ప్రాథమికంగా రెండు రకాలుగా చేస్తారు. క్యాన్సర్‌ను అదుపు చేయడానికి శస్త్రచికిత్సను చేస్తారు. సర్జరీ ద్వారా క్యాన్సర్ కణాల అసాధారణ పెరుగుదలను లేదా కణాల గడ్డను తొలగిస్తారు. సర్జరీ లేకుండా కీమోథెరపీ ద్వారా క్యాన్సర్ కు చికిత్సనందిస్తారు. దీనిలో ప్రాథమికంగా అసాధారణంగా పెరుగుతున్న కణాలను నాశనం చేయడానికి మందులను ఇస్తారు. మరొక చికిత్సా విధానం రేడియోథెరపీ. దీనిలో పెరుగుతున్న కణితి



మీదకు గామా కిరణాలు వంటి రేడియేషన్లను ప్రసరిపచేస్తారు. కొన్నిసార్లు, పేషేంట్స్ పరిస్థితిని బట్టి శస్త్రచికిత్స, శస్త్రచికిత్సకాని రెండు పద్ధతులను ఉపయోగిస్తారు. మొదట కణితి పరిమాణాన్ని తగ్గించడానికి రేడియోథెరపీ లేదా కీమోథెరపీ ని ఉపయోగిస్తారు. అనంతరం క్యాన్సర్ కణితిని తొలగించదానికి శస్త్రచికిత్స చేస్తారు. ఇతర భాగాలకు క్యాన్సర్ కణాల వ్యాప్తిని నివారించడానికి కీమోథెరపీ లేదా రేడియోథెరపీని మళ్ళీ ఆ ప్రాతంలో నిర్వహిస్తారు.





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ము(ఖ)ప్పు తిప్పలు

- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు
- సర్వత్రా వ్యక్తమవుతున్న ఆగ్రహం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల హాజరు కోసం తీసుకొచ్చిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ఉద్యోగులను ముప్పతిప్పలు పెడుతోంది. తొలుత ఉపాధ్యాయులకు, ఆ తరువాత జిల్లా కార్యాలయాల ఉద్యోగులకు ఈ విధానాన్ని అమలు చేయగా హాజరు కోసం ఇబ్బందులు పడుతుండటంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది...

ఉద్యోగులు తమ ఫోన్‌లలోనే ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా రోజు వారీ హాజరు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులకు ముఖ హాజరు తిప్పలు తప్పడం లేదు. ఆగస్టు 16 నుండి ఉపాధ్యాయులకు ఈ విధానాన్ని మొదలు పెట్టారు. సర్వర్ మొరాయిస్తుండడంతో ఉపాధ్యాయులు సెల్ ఫోన్‌తో కుస్తీ పడ్డారు. మారుమూల ప్రాంతాల్లో నెట్ కవరేజ్ లేకపోవడంతో యాప్ ఓపెన్ కాకపోవడం, సర్వర్లు పని చేయకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే విధానాన్ని జనవరి 15 నుంచి ఉద్యోగులకు కూడా అమలు చేయడంతో వారికి కూడా హాజరు తిప్పలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో 61 శాఖల పరిధిలో 16,870 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వారిలో ఇప్పటి వరకు 5,945 (35.24 శాతం) మంది వివరాలు నమోదు చేసుకున్నారు. 10,925 (64.76 శాతం) మంది ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకోలేదు. సైనిక్ వెల్ఫేర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్, లైఫ్ ఇన్సురెన్సు, ఫ్యాక్టరీస్ తదితర శాఖల ఉద్యోగులు వంద శాతం నమోదు చేసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకున్న వారిలో 70.33 శాతం మంది సమయం వారీగా హాజరువేస్తు న్నారు.

మున్సిపాలిటీలలో 431 మంది, ల్యాండ్ అడ్మినిస్ట్రే షన్ శాఖలో 205, పంచాయతీరాజ్‌లో 152, ప్రింటింగ్ ప్రెస్‌లో 109, పశు సంవర్ధకశాఖలో 75, మార్కెటింగ్ శాఖలో 69, వ్యవసాయశాఖలో 68, బిసి సంక్షేమ శాఖలో 66, సెబ్‌లో 64, సాంఘిక సంక్షేమశాఖలో 53, ఆర్అండ్‌బిలో 31, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 28, వాణిజ్య పన్నుల శాఖలో 26 ఇలా పలు శాఖల్లో ఉద్యోగులు ఎస్ఆర్ఎస్ నమోదు చేసినా హాజరు వేయడం లేదు. ఉద్యోగులు ఉదయం 8 నుండి 9 గంటలలోపు యాప్ ఓపెన్ చేసి ముఖహాజరు వేయాలి. ముఖం యాప్‌లో కనపడాలి లేకుంటే హాజరు లేనట్టే. ప్రభుత్వం కేటాయించిన సమయం దాటితే ఆరోజు సెలువు పెట్టుకోవాల్సి వస్తుంది. లేకుంటే గైర్హాజర్ కిందకు వస్తారు. కాబట్టి ఎలాగైనా యాప్‌లో హాజరు వేసుకోవాలని ఉపాధ్యాయులు విశ్వ ప్రయత్నాలు ఇప్పటికీ చేస్తున్నారు. ఇప్పుడు ఈ విధానాన్ని ఉద్యోగులకు అమలు చేయనుండటంతో వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

గతంలో ఉపాధ్యాయులు సెల్ ఫోన్‌లు పట్టుకొని నెట్ కోసం అటు ఇటు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడగా ఇప్పుడు ఉద్యోగులు కూడా తమ సెల్‌ఫోన్‌లు పట్టుకుని నెట్‌వర్క్ కోసం తిరగాల్సిన సమస్య ఏర్పడింది. గతంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నా మళ్లీ ఆ విధానాన్నే ఉద్యోగులకు అమలు చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

భూసేకరణను పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతీయ రహదారులు, 90 రోజుల ఇళ్ల పట్టాలు, పర్యాటక ప్రదేశాలు, ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలకు అవసరమయ్యే భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఆర్డీఓలు, మండల తాసిల్దారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాలులో భూ హక్కు పత్రాల పంపిణీ, మ్యుటేషన్ దరఖాస్తులు, పిఓఎల్ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం, స్పందన అర్జీలు, పౌర సరఫరాలు, 90 రోజుల ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ టి. నిశాంతితో కలిసి అన్ని మండలాల తాసిల్దారులు, ఆర్డీవోలతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ సేకరణ ప్రక్రియ మందకొడిగా సాగుతోందని వచ్చే వారానికి పూర్తి చేస్తామని ప్రతి సమావేశంలో చెబుతున్నారని,నిర్ణీత కాలవ్యవధి లోగా పూర్తి చేసి ప్రగతి తీసుకురాకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. జాతీయ రహదారులు, 90 రోజుల ఇళ్ల పట్టాలు, పర్యాటక ప్రదేశాలు, ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలకు అవసరమయ్యే భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి మాట్లాడుతూ ఎస్సీ కమ్యూనిటీకి సంబంధించి స్మశాన వాటికలకు ప్రభుత్వ భూములను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని తాసిల్దార్లను ఆదేశించారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రభుత్వ భూములు గుర్తించాలని లేనిపక్షంలో భూసేకరణకు వేగవంత చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, యం.దాసు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు, అన్ని మండలాల తహసీల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

365 రోజులూ మురుగు గుంటలాగే

- తీరు మారని రహదారి
- అనునిత్యం వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



రోడ్లపై ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి - కొత్తపల్లి : కొత్తపల్లి మండలం ప్రధాన రహదారిలో లింగాపురం వద్ద365 రోజులూ మురుగు నీరు దర్శనమిస్తూ వాహన దారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కొత్తపల్లి మండలంలో అత్యంత పురాతన పవిత్రమైన చరిత్ర కలిగిన కొలనుభారతి, సంగమేశ్వరం ఉన్నాయి. ఈ క్షేత్రాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రతి రోజు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి వెళుతుంటారు. ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మీదుగా పాములపాడు నుంచి లింగాపురం మీదుగా ఈ క్షేత్రాలకు భక్తులు వెళ్లాలి. అలాగే సిద్ధేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప, సంగమేశ్వరం, కపిలేశ్వరం, పాత మాడుగుల, ఎర్రమఠం, ముసలమడుగు, చిన్న గుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం, సింగరాజు పల్లి, బట్టువారిపల్లి, శివపురం గ్రామాల ప్రజలు ప్రతిరోజు తమ అవసరాల నిమిత్తం ఆత్మకూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు కూడా ఉన్నత చదువుల కోసం ప్రతిరోజు ఆత్మకూరుకు వెళ్లాలి. రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో పాటు ప్రవహిస్తూ ఉండడంతో ద్విచక్ర వాహనదారులు కింద పడిన ఘటనలు కూడా అనేకం. గత కొన్ని నెలల క్రితం లింగాపురం బస్టాండ్ సెంటర్లో మురికి కుంట సమస్య ఉంది. అయితే ప్రస్తుతం లింగాపురం బస్టాండ్ సెంటర్లో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడం వల్ల బస్టాండ్ సెంటర్లో మురికికుంట సమస్య తొలిగిపోయింది. రహదారి వెంట మాత్రం ఊరు చివరి దాకా నీరు ప్రవహిస్తూ ఉండడంతో ఒకవైపు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామస్తులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారోనని ఆ దారిలో ప్రయాణించే వాహనదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించడం లేదని వాహనదారులు చెబుతున్నారు. లింగాపురం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే గడపగడప కార్యక్రమంలో తిరిగిన సమయంలో ఈ రహదారిపైనే దాటుకుంటూ వెళ్లిపోయిన పరిస్థితి ఉంది. ఈ సమస్యకు మోక్షం కలిగేనా అని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక్కట్లు తప్పవు...

- నాగ శేషన్న, పెద్ద గుమ్మడాపురం



ప్రతి రోజు అవసరాల నిమిత్తం ఆత్మకూరు పట్టణానికి వెళ్లాలంటే లింగాపురం వద్ద ఇక్కట్లు తప్పడం లేదు. బైక్‌పై వెళున్నప్పుడు లింగాపురం ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండడం ప్రవహిస్తుండడం వల్ల బైక్ జారి కింద పడుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించాలి.



శాశ్వత భూహక్కు పత్రాలు అందజేసిన ఆర్థిక మంత్రి బుగ్గన

రైతుల సమస్యల పరిష్కారానికే సమగ్ర సర్వే

శాశ్వత భూహక్కు పత్రాలు అందజేసిన ఆర్థిక మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఏళ్ల తరబడి ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే సమగ్ర సర్వే చేపట్టి, శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బేతంచర్ల మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో 35 మందికి శాశ్వత భూ హక్కు పత్రాలను ఆయన శుక్రవారం శాశ్వత భూహక్కు పత్రాలను అందజేశారు. అంతకుముందు బేతంచెర్ల మండలం శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ముఖద్వారం నుండి అంబాపురం గ్రామం వరకు 95 లక్షల రూపాయలతో వేసిన తారు రోడ్డు ఆర్థిక మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రారంభించిన తారు రోడ్డు పైననే మద్దిలేటి స్వామి ముఖద్వారం నుండి అంబాపురం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం అంబాపురం గ్రామంలో శాశ్వత భూహక్కు భూ రక్ష కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి బుగ్గల రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు తీర్చడానికి రీ సర్వే చేసి వైఎస్సార్ ప్రభుత్వం ప్రజలకు శాశ్వత భూహక్కు పత్రాలను అందజేసే కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా తమ వారి కోసం తమ అనుచరుల కోసం ఆన్లైన్లో మోసాలను చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్, మండల సర్వే జోష్ణ, ఎంపీడీవో వెంకన్న, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తుజావలి, సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి చంద్రారెడ్డి, పాపసాని చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ యాదగిరి వెంకటేశ్వర్లు, కోడే వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు రుద్రవరం నారాయణ తిరుమలేశ్వర్ రెడ్డి, ఖాజా హుస్సేన్, ఎద్దులన్న, రంగాపురం సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, సిఐ ప్రియతమ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెన సాయం అందజేత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద జిల్లాలో అర్హులైన ముగ్గురు విద్యార్థులకు రు.12,25,400/-లను విద్యార్థుల తల్లుల ఖాతాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జమ చేశారని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానం ద్వారా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద ఈ ఏడాది టాప్ 200 విదేశీ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించే కార్యక్రమా న్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, తదితరులు లైవ్ ద్వారా వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా జిల్లాలో విద్యార్థులకు మొత్తం రూ. 12,25,400లను విద్యార్థుల తల్లులకు చెక్కు అందజేశారు.



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్,ఎమ్మెల్సీ తదితరులు



మాట్లాడుతున్న ఐదవ అదనపు జిల్లా జడ్జి వాసు

సత్వర న్యాయమే లోక్ అదాలత్ ధ్యేయం

- 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించి విజయవంతం చేయాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు పి. వాసు ఆదేశించారు. పట్టణంలోని ఐదవ అదనపు జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయవాదులకు, పోలీసు అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులలో ఇరుపక్షాల కక్షిదారులకు లోక్ అదాలత్ ల గురించి అవగాహన కల్పించి వీలైనంత ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలని వారిని ఆదేశించారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి రాధా రాణి, జూనియర్ సివిల్ జడ్జి శైలజలు మాట్లాడుతూ కక్షిదారులకు అవగాహన కల్పించి లోక్ అదాలత్‌కు సహకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీధర్, ఏపీపీలు సోమశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్, ఏజిపి షడ్రక్, డిఎస్పి సుధాకర్ రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి వైద్య శిబిరాలు : డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



మహా శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీశైలంలోని వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వెంకటరమణ తెలిపారు. శుక్రవారం శివరాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై జిల్లా ప్రోగ్రాం అధికారుల సమీక్షా సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య పరంగా 24 పాయింట్ల నందు ప్రధమ చికిత్స కేంద్రాలను, తగిన మందులను వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. పాదచారుల వద్ద 14 పాయింట్లను 2 షిఫ్ట్ లకుగాను ఇద్దరు ఎంహెచ్‌పిలు, ఇద్దరు ఏఎన్ఎంలు నలుగురు ఆశాలు పనిచేయడం జరుగుతుందన్నారు. శ్రీశైలం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వద్ద 10 పాయింట్లకు 3 షిఫ్ట్ లకు గాను వైద్యాధికారులను, వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - నంద్యాల



మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు

అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చెయ్యాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. నిర్మల పేర్కొన్నారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి సునీత అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు హాజరై మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహార క్వాంటిటీ పెంచాలని వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, అంగన్వాడీ సెంటర్ల పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు సెంటర్ పరిధిలోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకి అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అంగన్వాడీ సెంటర్లో మౌలిక వసతులు లేవని,కొన్ని కేంద్రాలలో, అసలు విద్యుత్ సౌకర్యంలేదని, విద్యుత్ సౌకర్యం ఉన్న ప్రభుత్వం బిల్లులు చెల్లించటం లేదన్నారు. టీఏ, డీఏలు గత 5 సంవత్సరాల కాలంగా ప్రభుత్వం చెల్లించడంలేదన్నారు. వైఎస్సాఆర్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుండి బిల్లులు చెల్లించలేదన్నారు. దీని వలన అంగన్వాడీలు అప్పులుచేసి లబ్ధిదారులకు ఆహారం వండి పెడుతున్నారన్నారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారు కానీ వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచెయ్యడం లేదని గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండటం లేదన్నారు. ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్న మెనూకు తగిన విధంగా మెనూచార్జీలు, సరుకుల క్వాంటిటీ పెంచలేదన్నారు. ఐసిడిఎస్ అధికారులు పీడీ, సీడీపీఓ, సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారని సెంటర్లను బలోపేతం చెయ్యడానికి నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల పర్యవేక్షణ చేయాలని, ఫుడ్ కమిషనర్, ఎం.ఎస్.కె, ఎం.ఆర్.ఓ, ఎం.డి.ఓ. రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలౌతున్నారని ఇటీవల రాజమండ్రిలో ఒక వర్కర్ అంగన్వాడీ సెంటర్లోనే గుండెపోటుతో మరణించిందన్నారు. కొంత మంది రాజీనామాకు సిద్ధపడుతున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల మీద పనిభారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని కోరారు. సమావేశంలో అంగన్వాడి జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, హరిత, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, నాగరాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న భూమా అఖిలప్రియ,భార్గవరామ్ లు

టిడిపి నాయకురాలి మృతికి మాజీ మంత్రి సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణం పాత బస్టాండ్ వీధికి చెందిన టిడిపి నాయకుడు దాదాపీర్ సతీమణి టిడిపి నాయకురాలు కౌసర్(36) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవరామ్‌లు చాగలమర్రి చేరుకొని మృత దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతి వ్యక్తం చేసారు. టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ బాష, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, మండల ప్ర చారకార్యదర్శి గఫార్, ప్రధాన కార్యదర్శి హనీఫ్,ఆలంసాగారి మౌళాలి, శ్యాబుల్, నాగూర్,బషీర్, నూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షకు తరలిన ఎస్‌టియు నాయకులు

ప్రజాశక్తి - చాగలమర్రి

సిపిఎస్ రద్దుకై ఎస్‌టియు ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షకు చాగలమర్రి ఎస్‌టియు నాయకులు శుక్రవారం తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శివశంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామి మేరకు సిపిఎస్‌ను రద్దు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎస్‌టియు నాయకులు నరసింహులు, శేషాద్రి, సురేషప్ప,శ్రీనివాసులు,నారాయణరెడ్డి,మహబూబ్‌బాష,సుబ్బారావు,మునయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ 5 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండల కేంద్రమైన బండి ఆత్మకూరు గ్రామంలో కుమ్మరి కుంట వీధిలో ముంతల ఆంజనేయులు ఇంట్లో ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటిలోని ఫ్రిడ్జ్, కూలర్, డబల్ కాట్ మంచాలు, ఫర్నిచర్ కాలి బూడిద అయ్యాయి. స్థానికులు వెంటనే ఫైర్ ఇంజన్ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వగా అప్పటికే కాలి బూడిద అయ్యాయి. వస్తువులను ఇంటిని ఫైర్ ఇంజన్ అధికారులు పర్యవేక్షించి అగ్ని ప్రమాదానికి కారణాలను పరిశీలించారు. విద్యుత్ ద్వారానే అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

ఘనంగా దస్తగిరి స్వామి దర్గాకు పూజలు

ప్రజాశక్తి - రుద్రవరం


మండలంలోని చిత్రేనిపల్లి గ్రామంలో శుక్రవారం నాడు దస్తగిరి స్వామి దర్గాకు ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామంలో ప్రజలు పసిడి పంటలు, సుఖశాంతులు, పిల్లాపాపలతో సుభిక్షంగా ఉండాలని కులాలు మతాలకు అతీతంగా ప్రజలు దర్గా దగ్గరకు జెండా, పూల సూచకాలు, ఊరేగింపుగా వెళ్లి పాత్య హాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సవాలను తిలకించడా నికి వచ్చిన ప్రజలకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలి : ఎఎస్ఓ

ప్రజాశక్తి - మహానంది



విద్యార్థులు బాగా చదువుకొని మంచి ర్యాంకులు సాధించాలని ఏఎస్ఓ మనోహర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది మండలం కేంద్రం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల గదులు,పరిసరాలు పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామసుబ్బయ్య, ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ఆర్ఎఆర్ఎస్ భూ కేటాయింపులపై హైకోర్టు తీర్పు హర్షణీయం

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మెడికల్ కళాశాలకు ఆర్ఏఆర్ఎస్ భూములు కేటాయించడం సరైనదే అంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి హర్షం ప్రకటించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ప్రజల చిరకాల కోరిక కోర్టు తీర్పుతో తీరిందన్నారు. టిడిపిలోకి వెళ్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. తన ఊపిరి ఉన్నంతవరకు వైసీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆడపిల్లల మీదకు కాలు దివే స్థాయికి తాను వెళ్ళనని, అది తన క్యారెక్టర్ కాదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విసిరిన సవాల్‌కు ఆయన సమాధానంగా చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్.మాబున్నీ సా, వైసిపి నాయకులు అమృత్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు

- జిల్లా ఎస్పీకె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు ఉంటాయని, జాతీయ రహదారులపై రాంగ్ రూట్‌లలో వెళ్ళవద్దని వాహనదారులు తమ భద్రతకు పోలీసుల సూచనలు పాటిస్తూ గమ్యాలకు క్షేమంగా చేరాలని జిల్లా ఎస్పీ కే రఘువీర్ రెడ్డి వాహనదారులకు సూచించారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిం చిన వారిపై పోలీసులు తీసుకున్న చర్యల వివరాలను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. మొత్తం రూ.4 లక్షల 43 వేల 675 ఈ చలనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఎస్పి పేర్కొన్నారు. ఈ నెలలో 3,337 ఈ చలనాలను (రూ.10 లక్షల 15 వేల 325లను) రికవరీ చేశామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినా, రహదారులపై ఇబ్బందికరంగా వాహనాలు నిలిపినా వెంటనే డయల్ 100కు సమాచారం చేరవేయాలన్నారు.


ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ధ్వజస్తంభ ప్రతిష్టలో ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని గాజులపల్లె రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీ గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వర స్వామి, నవగ్రహ ఆలయాల వద్ద శుక్రవారం నాడు ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమంను నిర్వాహకులు కె .మస్తాన్ రావు రుత్వికుల వేద మంత్రోచ్చరణలచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, సతీమణి శిల్పా నాగిని రెడ్డిలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ దంపతులను ఆలయ నిర్వాహకులు కనమర్ల పూడి మస్తానరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి విశేష పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రుత్వికుల వేద ఆశీర్వచనం చేయించి ఎమ్మెల్యే దంపతులకు శాలువా పూలమాలతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. తదనంతరం ఎమ్మెల్యే దంపతులు దర్శనార్థమై వచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్కువ కాలంలోనే మరకత లింగేశ్వర స్వామి గుడిని చక్కగా తీర్చిదిద్ది భక్తులకు అవసరమైన విశేష పూజలు నిర్వహిస్తూ వచ్చిన ప్రతి భక్తునికి అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు ఆలయ పరిసరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహానంది ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, నవగ్రహ ఆలయాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజును గెలిపించండి

ప్రజాశక్తి - బేతంచర్ల

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజుని గెలిపించాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగిన అభ్యర్థులను శుక్రవారం అభ్యర్థించారు. పట్టణంలో ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతులూ నాగరాజుని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకృష్ణ, వాల్మీకి సంఘం నాయకులు మిద్దె వెంకట నాయుడు మాట్లాడుతూ పోతుల నాగరాజుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యువజన సమాఖ్య జిల్లా నాయకులు రాజేష్, శ్రీనివాసులు, మనోహర్, అనిల్, నరేష్, మహేంద్ర, ప్రసాద్, బాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



22 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

కొలిమిగుండ్ల మండలం బందార్ల పల్లె గ్రామంలోని 22 ముస్లిం మైనార్టీ కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో మండలం బందర్ల పల్లె గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబాలు వైసీపీలో చేరాయి. బందార్ల పల్లె టిడిపికి చెందిన హుస్సేన్ పీరా, గౌస్ మోదిన్, మహమ్మద్, హుస్సేన్ బాషా, హాజీవలి, డిష్ వలి,హుస్సేన్ వలి, షేక్షావలి, నంద్యాల బాష, బుడెన్ సా, మస్తాన్ వలీ, హుస్సేన్ సా, రెడ్డిపల్లి బాష, కాశీం, జాకీర్,గొరుమాను పల్లె మహమ్మద్, వలి, నబి రసూల్, మహమ్మద్ సా, బాషు,ఆటో


ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరుతున్న టిడిపి నాయకులు

నూర్ భాషా, రజాక్ లు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడు తూ గ్రామంలో ముస్లిం మైనారిటీలకు స్మశానానికి సంబంధించి స్థల సేకరణ చేయడం జరిగిందని, ముస్లిం మైనార్టీలకు రంజాన్, బక్రీద్ ముఖ్య పండుగలో ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి ఈద్గా కావాలని కోరడం జరిగిందని వాటిని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బందార్ల పల్లె గ్రామ వైసిపి నాయకులు యాతం వెంకట శివరామిరెడ్డి, యాతం వీరగోపాల్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, మక్కల వెంకటరాముడు, ఉయ్యాల మనోహర్ రెడ్డి, పెద్దకృష్ణ, మల్లికార్జున, రాజా దేరంగుల తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - నందికొట్కూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలో వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం నందు పనిచేస్తున్న వాటర్ వర్క్స్ సిబ్బంది, ఎలక్ట్రిషన్స్ పార్కు, మెయింట నెన్స్ కంప్యూటర్ ఆపరేటర్లకు హెల్త్ అలివేన్సులు, పథకాలలో వెసులు బాటు కల్పించాలన్నారు. గతంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని గతంలో నోట్ విడుదల చేసినా.. 8 నెలల గడుస్తున్న ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జిల్లా సహాయ కార్యదర్శి పి.పక్కిర్ సాహెబ్ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. మాన్యువల్ పద్ధతిలోనే జీతాలు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, 25 వేలు తప్పకుండా వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం వినతి పత్రం మున్సిపల్ ఆర్వో విజయలక్ష్మి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కార్మికులు యూనియన్ నాయకు లు సిహెచ్ చాంద్ బాషా, పి .సర్వర్ ఖాన్, భాస్కర్ నాగేశ్వ రరావు ప్రభాకర్, అబ్దుల్ బసిత్, ప్రతాప్, హరి కృష్ణ, మల్ల మ్మ, ఎల్లమ్మ శుసంతమ్మ,రాముడు పాల్గొన్నారు.

జిల్లాల్లో ప్రీ- మార్ట్ మాంసం ఉత్పత్తి కేం ద్రాలు ఏర్పాటు

ఎపి మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీరాములు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రీ-మార్ట్‌ల ద్వారా పరిశుభ్ర మాంసం అందించేందుకు జిల్లాల్లో ప్రీ- మార్ట్ మాంసం ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాంసం అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీరాములు అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మని ఆయన వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని నంద్యాల పట్టణం స్థానిక పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో మాంస వినియోగదారులకు నాణ్యమైన పరిశుభ్రమైన మాంసము వినియోగంపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం. శ్రీరాములు, కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ ఎం శ్రీరాములు

ఎం. శ్రీరాములు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన,పరిశుభ్రమైన మాంసం సరఫరా చేసేందుకు ప్రీ-మార్ట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తొలుత పైలెట్ ప్రాజెక్టుగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వాటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వ్యాపారులు ఈ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ప్రీ-మార్ట్ పరిక రాల యూనిట్ కాస్ట్ రూ.15.34 లక్షలు కాగా అందులో 75 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంద న్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఓ నరసింహారావు, నంద్యాల డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ ఎస్సీ వెంకట సుబ్బారెడ్డి, ప్యాపిలి గొర్రెల పెంపకందారుల ట్రైనింగ్ సెంటర్ డీడీ శాంతయ్య, సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ సుధాకర్ రెడ్డి, జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం సాయి సంచాలకు లు డాక్టర్ రవిబాబు, ప్యాపిలి గొర్రెల పెంపకదారుల శిక్షణా కేంద్రం ఉపసంచాలకులు పి శాంతయ్య, నంద్యాల జిల్లా బస్సు వ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారి రవి బాబు, ప్యాపిలి గొర్రెల పెంపక దారిలో శిక్షణ కేంద్రం ఉపసంచాలకులు ఎం. శ్రీనివాస్ రెడ్డి డాక్టర్ రామ సుబ్బారెడ్డి, కర్నూలు డాక్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నర్సిరెడ్డి నీ పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తదితరులు

ఎర్రం నర్సిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని పెద్ద కంబలూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఎర్రం నర్సిరెడ్డిని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం వీర రాఘవ రెడ్డి లు పరామర్శించారు. శుక్రవారం గత వారం రోజుల క్రితంమోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడ్డ, నర్సిరెడ్డిని పెద్ద కంబలూరులోని ఆయననివాసంలో కలిసి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలోఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వైసిపి నాయకులుగంగిశెట్టి తిమ్మయ్య, కోఆప్షన్ నెంబర్,మదర్ సాహెబ్, కూలూరునరసింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి ,చంద్రశేఖర్ రెడ్డి, పాణ్యంచంద్ర. శ్రీకాంత్ రెడ్డి, రమణారెడ్డి,తదితరులు ఉన్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఉపాధ్యాయులను నిర్మించాలి : పిఆర్‌టియు

ప్రజాశక్తి - గోస్పాడు

ఉపాధ్యాయులకు పదోన్నపతులు సర్దుబాటు పూర్తయిన తరువాత ఏకో ఉపాధ్యాయ పాఠశాలలోగా మిగిలిన పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను నియమి ంచాలని టిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ రావు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట ్డుతూ ప్రభుత్వం 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్‌పై ఉపాధ్యా యులను మొదటిగా ఏకో ఉపాధ్యాయ పాఠశాలకు రోల్ కోరారు. ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులు నిర్వహి ంచ డం కష్టమని యాప్ పంపించడానికి తరగతి గదులు నిర్వ హించడానికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని కోరారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణానికి చెందిన తిరుమల ఫోటో స్టూడియో అధినేతలైన సుబ్బరాయుడు బ్రదర్స్ శుక్రవారం పేదవారికి దుస్తులను పంపిణీ చేశారు. నరసింహ స్వామి పారువేట ఉత్సవాల సందర్భంగా తమ తండ్రి పెద్ద సుబ్బన్న జ్ఞాపకార్థం వృద్ధులకు పట్టణ సీఐ జీవన్ గంగనాథ్ బాబు, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేసి, అన్నదానం చేశారు.


చికిత్స పొందుతున్న చిన్నారులు

దుర్గంధముతో స్కూలు చిన్నారులకు అస్వస్థత

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

మండల పరిధిలోని పోలూరు గ్రామంలోని సెయింట్ జాన్స్ అప్పర్ ప్రైమరీ పాఠశాల వెనుక భాగంలో ఉన్న పెద్ద డ్రైన్ జ్ గుంత నుండి తీవ్రమైన దుర్గంధము రావడంతో 18 మంది విద్యార్థులు శుక్రవారం అస్వస్థకు గురైయ్యారు. స్కూల్ కరెస్పాండెన్స్ యోహాను హుటా హుటిన మూడు 108 అంబులెన్స్‌లలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిల్లలు క్షేమంగా ఉన్నారని యోహాను చెప్పారు. పాఠశాల వెనుక భాగంలో పెద్ద మురుగు గుంతలో నిరంతరము నీరు నిల్వ ఉండటం వల్ల కప్పలకు, పాములకు, దోమలకు ఆవాసంగా మారిపోయింది. అధికారులు స్పందించి ఆ గుంత పూడ్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కేంద్రం తీరుపై డ్రైవర్లు ఉద్యమించాలి : వై ఆశీర్వాదం

ప్రజాశక్తి - శ్రీశైలం

ప్రతి సంవత్సరం వాహన ఇన్సూరెన్స్ కంపెనీలు 20 శాతం ప్రీమియంను పెంచుకునేందుకు రవాణా రంగ చట్టంను సవరించిన కేంద్ర ప్రభుత్వం తీరుపై పోరాడాలని వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం, అధ్యక్షులు ఏ బెనాహర్ పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లపై 302 (ఎ) సెక్షన్ కింద అరెస్టు చేసేందుకు అవకాశం కల్పించిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని కోరారు. ప్రమాదాలకు కారణాలుగా డ్రైవర్లను మాత్రమే బాధ్యులుగా చిత్రీకరించడం అత్యంత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు టాక్స్ 30 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వాహనాలపై విధిస్తున్న చలానాలను వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో రవాణా రంగ కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎస్కే వలి, వై శీను, అప్పలకొండ, బాబు, సమదు, వెంకటేశ్వర్లు, గోపాల్ నాయక్, శీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో ప్రభుత్వంపై వ్యతిరేకత

: మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూర్ : ప్రతి ఇంటిలోనూ జగన్ ప్రభుత్వం పై పూర్తి వ్యతిరేకత భావం కనిపిస్తుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఆరో వార్డు సిద్దేపల్లి రాస్తా కాలనీలలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత భావాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ మాజీ చైర్మన్ ఆహమ్మద్ హుస్సేన్, శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లాపురం బాష, వేణుగోపాల్ పాల్గొన్నారు.


ఇదేం కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రతి నెల 30న పౌర హక్కుల డే : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ప్రతినెల 30వ తేదీని పౌర హక్కుల దినోత్సవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామాన్ ఆయా శాఖల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యురాలు చిటికెల సలోమి ప్రతినెల సివిల్ రైట్స్‌డే నిర్వహించాలని, అందుకు తగ్గట్టు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆమె విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న జిల్లా కలెక్టర్ జిఒ ఎంఎస్ నెం.128 ప్రకారం ప్రతి నెల 30వ తేదీని (ఫిబ్రవరిలో 28వ తేదీ) "పౌర హక్కుల దినోత్సవం"గా జరుపుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో మండలంలో ఒక్కో గ్రామంలో ఆ రోజు ఎంఆర్ఓ, ఎంపిడిఓ, ఎంపిపి, సాంఘిక సంక్షేమ శాఖ, దేవాదాయ శాఖ అధికారులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి తదితర మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు

మెస్, కాస్మెటిక్ చార్జీలు ధరలకు అనుగుణంగా పెంచాలని నందికొట్కూరు ఎస్ఎఫ్ఐ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు శివ, డక్క కుమార్ శుక్రవారం విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఎంఆర్ఓ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తాసిల్దారు పద్మావతమ్మకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పెరుగు తున్న నిత్యవసర వస్తువుల ధరలు కనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మెటిక్ ఛార్జీలు పెంచి ప్రతి నెల రెగ్యులర్‌గా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, సహాయకార్యదర్శులు ఆంజనేయులు, ఫిరోజ్ విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

నేడు ఐఎంఏ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన సదస్సులు, స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. క్యాన్సర్ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స అందించి సాధారణ జీవితం గడపడానికి అవకాశం ఉంటుందన్నారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడానికి వివిధ దశలలో తీవ్రత గుర్తించడానికి అత్యంత ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయ న్నారు. ఐఎంఏ వివిధ శాఖల ఆధ్వర్యంలో, మహిళా వైద్య విభాగాల నిర్వహణలో రాష్ట్రవ్యాప్తంగా పలు పట్టణాలలో, నగరాలలో క్యాన్సర్ అవగాహన సదస్సులు, క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నా మన్నారు.

అల్లూరులో కేంద్ర పరిశీలన కమిటీ

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

కేంద్ర ప్రభుత్వ పథకాల పరిశీలనకే కమిటీ ఏర్పాటు చేశారని కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు ప్రదీప్ కుమార్, సంతోష్ కుమార్ ప్రధాన్‌లు శుక్రవారం అల్లూరు గ్రామంలో పర్యటించారు. అనంతరం ఏర్పాటుచేసిన గ్రామసభలో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధురి కృష్ణవేణి, ఉప సర్పంచ్ బొర్రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఉపాధి హామీ అడిషనల్ పీడీ దాస్, ఏపీడి సాంబశివరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు

పార్టీల అతీతంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అర్హులైన పేదలందరికీ కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందివర్గం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ ,సంక్షేమ పథకాల బుక్లెట్టును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్యామలాదేవి, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు నారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు సంటెన్న, వైసీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బాదినేని శ్రీనివాస యాదవ్, కొండారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో శివరామయ్య, వైసిపి నాయకులు ఖాజా హుస్సేన్, వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, ఇందిరా క్రాంతి పథకం ఏపీఎం తిరుపాల్ రెడ్డి పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుమండలంలోని కృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంటిలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. వైసీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, శిల్పా భువనేశ్వర్ రెడ్డి, ఎం పుల్లారెడ్డి, తిరుపాలు, జడ్పీ సభ్యుడు శివశంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యేలు

ఈ క్రాప్ నమోదు తప్పని : జిల్లా వ్యవసాయ అధికారి


సమావేశంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జిల్లాలో రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్. లింగం దిన్నె గ్రామంలో గ్రామ వ్యవసాయ సలహా సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని అలాగే రైతు భరోసా కేంద్రాలు అందించే అన్ని సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈసమావేశంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, ఏఈఓ నరసింహ, విఏఏలు, వ్యవసాయ సలహా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** బీ సీజన్లో సాగుచేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం పెద్దదేవలాపురంలో ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. **కొలిమిగుండ్ల :** పెద్దవెంతుర్ల గ్రామంలో గ్రామ వ్యవసాయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వేంకటేశ్వర రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. శెనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని చైర్మన్ పేర్కొన్నారు. రైతూ గ్రూపు సభ్యులకు సరఫరా చేసిన వ్యవసాయ పని యంత్రాలను పరిశీలించారు. ఈ సమావేశంలో ఆర్బికే ఇంఛార్జి హిధయ తుల్ల, కమ్మవారిపల్లె సర్పంచ్ కొండయ్య, ఎస్ వెంకటేశ్వర రెడ్డి, ఏఈఓ నాగరాజు, విఏఏలు తదితరులు పాల్గొన్నారు.


బండి ఆత్మకూర్ లో..



దోమల బెడదపై ఫాగింగ్

వైస్ ప్రెసిడెంట్ బి ఇంతియాజ్

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండల కేంద్రములోని పలు వార్డుల్లో దోమల బెడద నిర్మూలనపై జరుగుతున్న ఫాగింగ్ కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహిస్తునట్లు గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ బాసాపురం ఇంతియాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఫాగింగ్, శానిటేషన్,వంటి పారిశుధ్య కార్యక్రమాలను సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర అధ్వర్యంలో వైస్ ప్రెసిడెంట్ ఇంతియాజ్ పరిశీలించారు. ప్రజల నివాస కుటుంబ పరిసరాలతో పాటు కూడళ్లలోని స్థలాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్, ఉప సర్పంచ్ సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పానికి చేయూత నివాలని సర్పంచ్ ఎల్ సాలమ్మ చంద్ర, ఉప సర్పంచ్ భసాపురం ఇంతియాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ పి అర్ డి సాల్మన్ రాజ్, శానిటేషన్ మేస్త్రి రాజా రావు, ఇతర వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు నిరసిస్తూ యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి - బనగానపల్లె

సిపిఎస్ రద్దు చేయాలని ఓపిఎస్ కొనసాగించాలని గన్నవరంలో యుటిఎఫ్ చేపట్టిన సంకల్ప దీక్షను ప్రభుత్వం ,పోలీసు దమన కాండతో యుటిఎఫ్ శ్రేణులను అరెస్టు చేసినందుకు నిరసనగా బనగానపల్లె యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు ఎన్ ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య ప్రకాశం మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల డిమాండ్లను, అవసరాలను, కోరికలను తెలుపుకొనుటకు ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అక్రమంగా ఎక్కడికక్కడ ఉద్యోగులను ఉపాధ్యాయులను అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ బాలకృష్ణ, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాలంగిరి రాముడు, సిపిఐ సీనియర్ నాయకులు కృష్ణమాచార్య యుటిఎఫ్ ఆర్థిక కార్యదర్శి ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ కార్యాలయంలో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

జెడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

జూపాడుబంగ్లా: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈవో నాసర రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించి హాజరు రిజిస్టర్, ఇంటి పన్నులు, పంచాయతీ నిర్వహణ వివరాలు, పారిశుధ్య వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. 14వ ఫైనాన్స్, 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంపై ఖర్చుల గురించి, ఆఫీసు ఖర్చుల గురించి అధికారులు ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి విధుల పట్ల అలసత్వంవహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఎంపీడీవో మంజుల వాణి, ఎంపీపీ సువర్ణమ్మ, జెడ్పిటిసి జగదీశ్వర్ రెడ్డి, వైట్కస్ ఎంపీపీ కృష్ణారెడ్డి ఉన్నారు.

5న టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి - బనగానపల్లె



ఈనెల 5వ తేదీన పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నియోజక వర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఆర్‌టిఎస్ సమావేశాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ మండల నాయకులు, బూత్ ఇంచార్జ్ లు, క్లస్టర్ ఇంచార్జ్ లు, సెక్షన్ ఇంచార్జ్ లు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న గూడూరు సంజీవ రాయుడు

బలిజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి

- బలిజ సంఘం రాష్ట్ర కన్వీనర్ గూడూరు సంజీవరాయుడు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

బలిజలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని బలిజ సంఘం రాష్ట్ర కన్వీనర్, అహోబిలం బలిజ సంఘం అన్నదాన సత్రం ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డలో లక్ష్మీనరసింహస్వామి పారువేట తిరుణాల సందర్భంగా బలిజ సంఘం నాయకులు మంగమ్మ గారి ప్రసాద్ ఆహ్వానం మేరకు ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా బలిజల ఓటు బ్యాంకు అధికంగా ఉన్నా ఉన్నత పదవులలో మాత్రం వారికి అవకాశం లేదన్నారు.

ఆర్‌బికెలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - పాణ్యం

మండల కేంద్రంలోని ఆర్బికేలను నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ రబి సీజన్లో ఈకేవైసీ చేయించుకున్న పలు రికార్డులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ రాజశేఖర్ మాట్లాడుతూ పంట నమోదు ఖచ్చితంగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జయప్రకాశ్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు,విఏఏలు తదితరులు పాల్గొన్నారు.

19 మంది వాలంటీర్లకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని నెహ్రునగర్ గ్రామం సచివాలయం1 పరిధిలోని 19 మంది గ్రామ వాలంటీర్లకు షోకాజ్ నోటీసులు జారీసినట్లు ఎంపిడిఓ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడారు. ఈ నెల 2వ తేదిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొనెందుక గ్రామానికి వచ్చారన్నారు. గ్రామంలోని సచివాలయ-1 పరిధిలోని వాలంటీర్లు హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే వెనుతిరిగి వెళ్లిపోయారు. 19 మందిలో వాలంటీర్లలో గురువారం 15 మందికి, శుక్రవారం నలుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.